1

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి

గురువారం | మార్చి 06, 2025 | www.navatelangana.com

బైక్ ఢీ కొనడంతో వాకర్ మృతి



నవతెలంగాణ-రామారెడ్డి

అతివేగంతో, జాగ్రత్తగా బైకు నడపడంతో మహిళా మృతి చెంది.. ముగ్గురికి గాయాలైన ఘటన మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వరాల ప్రకారం... రామారెడ్డికి చెందిన చౌకి అరవింద్, అతని స్నేహితులు భానూరి చంద్రారెడ్డి, లచ్చనొల్ల ప్రణయ్ రాత్రి భోజనం తర్వాత లక్ష్మీ నగర్ కాలనీ నుండి రతాల గైన వైపు వాకింగ్ చేస్తుండగా, రామారెడ్డి గ్రామానికి చెందిన ఒగ్గు సాగర్,తల్లిని బైక్పై కూర్చుండబెట్టుకొని అజాగ్రత్తగా, అతివేగంగా బైకు నడుపుతూ ముగ్గురిని టక్కరించగా క్రిందపడి గాయాలయ్యాయి. కొద్ది దూరం లో తల్లి ఒగ్గు మణవ్వ (48) కిందపడటం తో తలకు గాయమై , రక్తస్రావం కావడంతో అక్కడికక్కడే మృతి చెందిందని చౌకి అరవింద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై నరేష్ తెలిపారు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

గంజాయి, అల్ప్రాజోలం కాల్చివేత



నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ డ్రగ్ డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో పాత కేసులలో సీజ్ చేసిన గంజాయి, అల్ప్రజోలంను బుధవారం డిస్పోజ్ చేశారు. జక్రన్‌పల్లి మండలంలోని పడకల్‌లో గల మెడికేర్ సర్వీసెస్‌లో ఇంచార్జ్ పోలీస్ కమిషనర్ సి.హెచ్. సింధు శర్మ డ్రగ్స్ డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో దర్యాప్తు ముగిసిన నిజామాబాద్ జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్ లలోని 23 కేసులలోని గంజాయి 616 కేజీల 837 గ్రాములు, అల్ప్రజోలం- 3.444 కేజీలు డిస్పోజ్ చేశారు. కమిటీ సభ్యులు అడిషనల్ డీ.సీ.పీ (అడ్మిన్) జి. బస్వా రెడ్డి, నిజామాబాద్ ఏ.సి.పి రాజ వెంకట్ రామ్ రెడ్డి, ఏ.సి.పి రవీందర్ రెడ్డి సభ్యుల సమక్షంలో నిర్వహించారు.

క'న్నీటి' కష్టాలు

- ఎండుతున్న పంటను కాపాడుకునేందుకు రైతుల పాట్లు

నవతెలంగాణ-భీంగల్ రూరల్

యాసంగి సీజన్‌లో వరి పంట చేతికి వచ్చే సమయంలో రైతులకు సాగునీటి కష్టాలు వెంటాడుతున్నాయి. వేసవికి ముందే బోర్లు ఎత్తిపోతుండడంతో నీరందక పంటలు ఎండిపోతున్నాయి. ముఖ్యంగా జిల్లాలోని భీంగల్ మండలంలోని ప్రజలకు పెద్ద మొత్తంలో నీటి సమస్య ఉంది, ఎందుకంటే బాల్కొండ నియోజకవర్గంలో పెద్ద ప్రాజెక్టు ఉన్నప్పటికీ, ఆ ప్రాజెక్టుల నుండి నీటిని భీంగల్ మండల ప్రజలకు అందించడానికి పట్టించుకుని నాధుడే కరువయ్యారు. పలుగ్రామాల్లో చెరువులు ఎండిపోయి మైదానాలను తలపిస్తున్నాయి. ప్రభుత్వం ఒకవైపు రైతుభరోసా ఇవ్వకపోవడం, మరోవైపు రైతులు బోర్లు, బావుల ఆధారంగా పంటలు ఎలాగైనా పండించుకోవచ్చనే ధీమాతో వరి సాగు చేశారు. కానీ ఇప్పుడు భూగర్భ జలాలు అడుగంటడంతో బావులు ఎండిపోతుండగా, బోర్లలో నీళు తగ్గిపోయాయి.

బోరుబావుల కింద పంటలు సాగు చేసిన రైతులు నీటి కష్టాలు ఎదుర్కొంటున్నారు. భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో బోర్ల నుంచి నీరు రావడం లేదు. దీంతో పంటలను కాపాడుకోవడానికి రైతులు భగీరథ ప్రయత్నం చేస్తున్నారు. పంటలను కాపాడుకునేందుకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసుకుంటున్నారు. ఈ పంటలను కాపాడుకునేందుకు ప్రతిరోజూ రూ.వేలు ఖర్చు చేసి ట్యాంకర్ల ద్వారా నీటిని తోలించుకుంటున్నారు. పంట చేతికొచ్చే సమయానికి బోర్లలో భూగర్భ జలాలు ఇంకిపోయాయి. నెల రోజులైతే పంట చేతికొస్తుంది అన్న సమయానికి బోర్లలో నీరు ఎండిపోవడంతో మూడు రోజుల నుంచి రెండు ట్రాక్టర్ల ద్వారా నీటిని తెప్పించి పంటను రక్షించు కునేందుకు ప్రయత్నిస్తున్నామని భీంగల్ మండలం పిప్రి గ్రామానికి చెందిన వెన్నెల గణేష్, బెజ్జోరా రాజేశ్వర్, బడా భీంగల్ అశోక్ ఆవేదన వ్యక్తం చేశారు. మరోసారి నీటిని పెడితేనే పంట చేతికొచ్చే పరిస్థితి ఉంది అని ఆవేదన వ్యక్తం చేశారు.

వాటర్ ట్యాంక్ ద్వారా పొలంకు నీరు



పట్టభద్రుల విభిన్న తీర్పు

- మొదటి ప్రాధాన్యతలో ఎవరికీ మెజార్టీ ఇవ్వని గ్రాడ్యుయేట్లు
- ఎలిమినేషన్ ప్రక్రియలో బయటపడ్డ బీజేపీ
- అంచనాలకు అందని తీర్పుతో కంగుతిన్న కాంగ్రెస్
- ఒంటరిగానే పోటీ చేసిన 'ప్రసన్న'కూ ఆదరణ
- కాంగ్రెస్ ఫలితాలను ప్రభావితం చేసిన 28,686 చెల్లని ఓట్లు
- కనీసం చెల్లని ఓట్లమేరకూ సంపాదించలేకపోయిన 54మంది స్వతంత్రులు



నవతెలంగాణ-నిజామాబాద్ డెస్క్

ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ పట్టభద్రుల ఎన్నికల ఫలితాలల్లో గ్రాడ్యుయేట్లు సంపూర్ణంగా ఒకే వ్యక్తికి మేజిక్ ఫిగర్ మద్దతు ఇవ్వకుండా విభిన్న తీర్పును ఇచ్చారు. అందులోనూ నువ్వా..నేనా అన్నట్టుగా ముగ్గురు అభ్యర్థుల నడుమ త్రిముఖ పోరు సాగగా.. ముగ్గురికీ 5వేల నుంచి 10వేల నడుమ ఓట్ల తేడాతో మద్దతునిచ్చిన గ్రాడ్యుయేట్లలో 28,686 మంది ప్రాధాన్యత ఓటు అంకెను రాయడంతో తప్పులు చేసి చెల్లనవిగా చేశారు. తుదకు ఈ చెల్లని ఓట్లు బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డిని చివరి వరకూ ఢీకొన్న కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డి ఫలితాలను ప్రభావితం చేశాయనడంతో అతిశయోక్తి లేదు. పైగా ప్రభుత్వ వ్యతిరేకత ఏస్థాయిలో ఉందో అటు బీజేపీ, ఇటు బీఎస్పీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణకు పడ్డ ఓటింగ్ శాతమూ అద్దం పడుతోంది. ఏదేమైనా రెండో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపులో భాగంగా నిర్వహించిన ఎలిమినేషన్ ప్రక్రియ ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగి.. చివరకు బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డిని విన్నర్‌గా తేల్చింది. రన్నర్‌గా నరేందర్‌రెడ్డిని నిలిపింది.

మొత్తం 3,55,159 ఓటర్లకుగాను కేవలం 2,52,029 ఓట్లు మాత్రమే పోలవగా.. ఇందులో 28,686 చెల్లని ఓట్లుగా గుర్తించారు. చివరకు 2,23,343 వాల్యూడ్ ఓట్లు గుర్తించిన అధికారులు మొదటిప్రాధాన్యత ఓట్ల లెక్కింపులో మేజిక్ ఫిగర్ 1,11,672 ఓట్లుగా నిర్ధారించారు. 11 రౌండ్లలో ఏ ఒక్కరికీ ఆ ఫిగర్ దరిదాపుల్లో కూడా ఓట్లు సంపాదించలేకపోయారు. రెండో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపులో భాగంగా పోటీ ఉన్న మొత్తం 54 మంది అభ్యర్థుల్లో తొలుత అత్యల్ప ఓట్లు సాధించిన అభ్యర్థిని ముందుగా ఎలిమినేట్ చేస్తూ వచ్చారు. ఇలా 54 మందిని ఎలిమినేట్ చేశారు. అయితే రాత్రి 11గంటలవరకు 5వేల లీడ్‌లో విజయాన్ని అందుకున్న అంజిరెడ్డికి 52మంది ఎలిమినేషన్ తరువాత 77851ఓట్లు సాధించారు. తరువాత 5813 వేల ఓట్ల తేడాతో కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డికి 72,038ఓట్లు వచ్చాయి. మొదటిప్రాధాన్యత ఓట్లలో మూడోస్థానంలో నిలిచిన ప్రసన్నహరికృష్ణకు 63వేల ఓట్లు పోలయ్యాయి.

అంజిరెడ్డి... ఇన్నాళ్లకు గెలుపును అందుకుని..

బీజేపీ నుంచి పోటీచేసిన అంజిరెడ్డి సొంత జిల్లా సంగారెడ్డిలోని పటాన్‌చెరు నియోజకవర్గం. ఆయన రియల్ ఎస్టేట్ వ్యాపారంతోపాటు వివిధ వ్యాపారాలు, పరిశ్రమలు నిర్వహిస్తున్నారు. అందులోనూ రూ.వేలాది కోట్ల ఆస్తులూ ఉన్నాయి. పైగా ఈ పట్టభద్రుల ఎమ్మెల్సీలో నిలిచిన అభ్యర్థుల్లోకెల్లా ఆయనే ధనవంతుడు. అయితే ఈయన, ఈయన కుటుంబానికి రాజకీయాల్లో గెలుపు వరించలేదు. మూడు సార్లు ప్రజాక్షేత్రంలో ప్రయత్నించి విఫలమయ్యారు. తొలుత పీఆర్‌పీలో చేరిన ఆయన తరువాత బీజేపీలో ఆతరువాత కాంగ్రెస్‌లో తిరిగి కమలం గూటికి ఇలా.. పార్టీలను మారుకుంటూ వచ్చారు. చివరకు ఈ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీలో బీజేపీ టిక్కెట్ ఇవ్వడంతో తన అదృష్టాన్ని పరీక్షించుకోగా.. అంత సునాయసంగా గెలుపుతీరానికి చేరుకోలేదు. అటు కాంగ్రెస్ నుంచి ఇటు స్వతంత్ర్య అభ్యర్థి పోటాపోటీగా ఓట్లు సంపాదించుకోగా.. మొదటిప్రాధాన్యతలో వెనుకబడ్డారు. చివరకు రెండో ప్రాధాన్యత

ఓటమితో నరేందర్‌రెడ్డి కలత..

ట్యూషన్‌మాస్టర్ నుంచి అల్ఫోర్స్ విద్యాసంస్థలను స్థాపించి ఉత్తర తెలంగాణలోనే తిరుగులేని విద్యాధినేతగా ఎదిగిన నరేందర్‌రెడ్డి రాజకీయాల్లో తన అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు ఈ పట్టభద్రుల ఎమ్మెల్సీ బరిలో నిలిచారు. విస్తృతమైన పరిచయాలు, ప్రజల్లో సుపరిచితుడైన ఈయన ఏకంగా అధికార కాంగ్రెస్ టిక్కెట్‌నూ పొంది బలమైన అభ్యర్థిగా బరిలో నిలిచారు. ఆయన పోటీ చేస్తున్నట్టుగా ప్రకటించిన నాటి నుంచి ప్రత్యర్థులు కాంగ్రెస్‌పై విమర్శలకంటే ఆయనపై వ్యక్తిగత ఆరోపణలు చేస్తూ విద్యాసంస్థలను నిర్వహించే క్రమంలో ఆయన వ్యవహార శైలిని ఎత్తిచూపుతూ సోషల్‌మీడియాలో బలమైన ప్రచారమే చేశారు. అవన్నీ దాటుకుని, వాటన్నింటికీ సమాధానం చెబుతూ అధికారపార్టీ నేతలనుసమన్వయం చేసుకుంటూ ప్రత్యర్థులకంటే ధీటుగానే ప్రచారాన్ని నిర్వహించారు. అయితే ఇటీవల ప్రభుత్వంపై పెరిగిన వ్యతిరేకతకు తోడూ ప్రత్యర్థుల ప్రతికూల ప్రచారాన్ని సైతం ఎదుర్కొని మరీ ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో గట్టిపోటీనే ఇచ్చారు. అయినప్పటికీ మొదటి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు నుంచీ గట్టిపోటీనిస్తూ చివరి ఎలిమినేషన్ ప్రక్రియవరకూ అంచనాలకు అందని ఓటమితో కాంగ్రెస్ అభ్యర్థి వుట్కూరి నరేందర్‌రెడ్డి ఒకింత షాక్‌కు గురయ్యారు. ఓటమితో కలత చెందిన ఆయన కౌంటింగ్ కేంద్రం నుంచి బయటకొస్తూ ఒకింత కన్నీటి పర్యంతమయ్యారు.



ఓట్ల లెక్కింపులో భాగంగా ఎలిమినేషన్ ప్రక్రియలో కేవలం 5వేల ఓట్లతోనే గెలుపును అందుకోగలిగారు.

కాంగ్రెస్ ఫలితాలపై చెల్లని ఓట్ల ప్రభావం..

పేరుకు పీజీలు, పీహెచ్‌డీలు చేసిన పట్టభద్రులు అయినప్పటికీ వారిలో కొందరు ఎమ్మెల్సీ ఓటు కూడా సరిగ్గా వేయలేకపోయారు. పట్టభద్రుల నియోజకవర్గంలో మొత్తం 3లక్షలా 55వేల మంది గ్రాడ్యుయేట్లలో 2లక్షలా 52వేల మంది మాత్రమే ఓటు హక్కు వినియోగించుకున్నారు. సుమారు లక్ష మంది ఓటుకు దూరంగా ఉండిపోయారు. ఇక ఓటేసిన వారిలో 28,686 మంది ప్రాధాన్య అంకెకు ముందు సున్నా పెట్టడం, లేదా అంకెకు సున్నా చుట్టడం, ఫొటోలు చించడం, తొలి ప్రాధాన్యం ఒకరి కంటే ఎక్కువ మందికి ఇవ్వడం, ఫొటోలకు ముందు టిక్ పెట్టడం, సంతకాలు చేయడం, ప్రభుత్వానికి, ఆయా పార్టీలకు వ్యతిరేకంగా నినాదాలురాయడం వంటి పనులతో ఆ ఓట్లన్నీ చెల్లకుండాపోయాయి. ప్రస్తుతం గెలుపుతీరాల్లో ఢీ అంటే ఢీ అంటూ పోటీపడి ఓటమిపాలైన నరేందర్‌రెడ్డి ఫలితాలపైనే వీరి ప్రభావం ఎక్కువగా చూపిందనడంలో అతిశయోక్తి లేదు.

'ప్రసన్న'కు ఊహించని ఆదరణ..

విన్నర్ పబ్లికేషన్ అధినేత, ప్రభుత్వ అధ్యాపకుడైన ప్రసన్నహరికృష్ణకు ఉద్యోగ, నిరుద్యోగ, యువతతో మంచి పట్టు ఉంది. సుమారు 20ఏండ్లకుపైగా కోచింగ్ సెంటర్లు, పబ్లికేషన్ పుస్తకాలతో ఎంతో మందియువతకు దగ్గరయ్యాడు. వారి ఉన్నతస్థాయికి తనవంతు పాత్ర పోషించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ పోరులో యువతకు అండగా ఉంటానని, బీసీలకు రాజకీయాల్లో తగిన ప్రాధాన్యత కావాలనే నినాదంతో ఈ పోటీలో నిలబడ్డారు. అయితే ఈయనకు ఉన్న ఫాలోయింగ్‌తో అధికార కాంగ్రెస్ అయినా, విపక్షంలోని బీఆర్ఎస్ నుంచి అయినా టిక్కెట్‌వస్తుందని అందరూ భావించినా చివరకు ఆయన భంగపాటే ఎదురైంది. అయినప్పటికీ ఆయన స్వతంత్రునిగా బరిలోకి దిగారు. ప్రాధాన్యత క్రమం కోసం బీఎస్పీ టిక్కెట్‌పై పోటీ చేసిన ఆయన ప్రధానంగా బీసీ నినాదం, ప్రభుత్వం, ఆయా పాలకుల వైఫల్యాలను ఎత్తిచూపుతూ యువతలో మంచి క్రేజ్ సంపాదించుకున్నారు. ప్రధాన పార్టీల అభ్యర్థులతో పోల్చితే ఎన్నికల ఖర్చులో ఆర్థికంగా పోటీపడలేకపోయినా 63,679 ఓట్లు సాధించారు. ఇది విజేతతో పోల్చితే కేవలం 10వేల ఓట్ల తేడానే ఉంది. సమీప ప్రత్యర్థికి 5వేల ఓట్ల తేడా మాత్రమే ఉంది. తనపై నమ్మకంతో ఈ స్థాయిలో స్వచ్ఛందంగా ఆదరించిన ఓటర్లకు కృతజ్ఞతలు తెలుపుతూనే రాజకీయాల్లో బీసీల ప్రాధాన్యత తగ్గించేలా కాంగ్రెస్, బీజేపీలు ఓటర్లకు విచ్చలవిడిగా డబ్బులు పంచారని ఆరోపించారు.

తొలిరోజు ప్రశాంతం

- ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు
- 753 గైర్హాజరు




నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఇంటర్మీడియట్ పరీక్షలు బుధవారం మొదటి సంవత్సరం తెలుగు, హిందీ, సంస్కృతం, ఉర్దూ భాష సబ్జెక్టుతో పరీక్ష లు ప్రారంభమయ్యాయని జిల్లా ఇంటర్ విద్య అధికారి తిరుమలపుడి రవికుమార్ తెలియజేశారు. మొత్తం జిల్లాలో 19,191 మంది విద్యార్థులకు గాను 18,438 విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారని తెలియజేశారు. కాగా 753 మంది విద్యార్థులు గైర్హాజయ్యారని మొత్తం 96.1 శాతం విద్యార్థులు పరీక్షలు రాయగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా పరీక్షలు ప్రారంభమయ్యాయని తెలిపారు. జిల్లాలో మొత్తం 57 పరీక్ష కేంద్రాలకు గాను 50 పరీక్ష కేంద్రాలను జిల్లా పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులతో పాటు తాను ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్ లు, హై పవర్ కమిటీ, బల్క్ అధికారి, కస్టోడియన్లు తనిఖీ చేసి పర్యవేక్షణ చేసారని జిల్లా ఇంటర్ విద్యా అధికారి తెలిపారు. జిల్లా ఇంటర్ విద్యా అధికారి తిరుమలపూడి రవికుమార్ నిజామాబాద్ పట్టణంలోని ఖిల్లా బాలుర జూనియర్ కళాశాల ఏ సెంటర్, బి సెంటర్ , కంటేశ్వర్ లోని ఎస్సార్ జూనియర్ కళాశాలలను, సి.ఎస్.ఐ. జూనియర్ కళాశాల, గోల్డెన్ జూబ్లీ జూనియర్ కళాశాల, నిర్మల హృదయ జూనియర్ కళాశాల, ఉమెన్స్ జూనియర్ కళాశాలలను తనిఖీ చేసి సమీక్షించారు.

గెలుపు ధీమాలో ఓటమి

- పీఆర్‌టీయూకు ఎదురుదెబ్బ
- నేతల సమన్వయ లోపం
- అమ్ముడుపోయిన నేతలు..?



నవతెలంగాణ-నసురుల్లాబాద్

కరీంనగర్, నిజామాబాద్ మెదక్ ఆదిలాబాద్ ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాల్లో పీఆర్టియు నేతలకు షాక్ తగిలింది. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గ ఎన్నికల్లో పీఆర్టియు నేతలు అంతగా ప్రచారం చెయ్యక పోవడం, మండల కేంద్రాల్లో ఉన్న ఓటర్లను పలకరించక పోవడంతో కొందరు ఉపాధ్యాయుల ఓట్లు క్రాస్ ఓటింగ్ జరగడంతో పీఆర్టియుకు గట్టి షాక్ తగిలింది. ఎక్కువ శాతం ఓటర్లు పీఆర్టియు సంఘం సభ్యులు ఉన్నా.. ఆ యూనియన్ బలపరిచిన అభ్యర్థి ఓటమి చెందడంతో జిల్లాలో పీఆర్‌టీయూ సభ్యులు అవాక్కవతున్నారు. ప్రతి జిల్లాలో 90 శాతం మంది ఉపాధ్యాయులు పిఆర్‌టియు సభ్యత్వం పొందిన వారే కావడం విశేషం. బాన్సువాడ మండలంలో సుమారు 348 మంది ఉపాధ్యాయులు ఉండగా బీర్కూర్ మండలంలో 114 నసురుల్లాబాద్ మండలం లో సుమారు 120 మంది ప్రభుత్వ ఉపాధ్యాయులు ఉన్నారు. ఇందులో 90 శాతం మంది ఉపాధ్యాయులు సభ్యత్వం తీసుకోగా 10 శాతం ఇతర సంఘ సంఘాల సభ్యత్వం తీసుకున్నారు. పి ఆర్ టి యు లో 10 శాతం వరకు డబుల్ సభ్యత్వం తీసుకున్నవారు ఉన్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయుల్లో అత్యధిక శాతం పిఆర్ టి యు సభ్యత్వం పొందిన ఉపాధ్యాయులే ఎక్కువగా ఉన్నారు.

పిఆర్టియు అభ్యర్థి వంగ మహేందర్ రెడ్డి, బీజేపీ అభ్యర్థిగా మల్కా కొమురయ్య పోటీలో ఉండగా తొలి ప్రాధాన్యత మొదటి ప్రాధాన్యతలోనూ పిఆర్టియు అభ్యర్థి వంగ మహేందర్‌రెడ్డి వెనకపడ్డారు. బ్యాలెట్ ఓటింగ్‌లో పిఆర్టియు అభ్యర్థికి భంగపాటు ఎదురైంది. రాష్ట్రంలో ఓటమి ఎరుగని పిఆర్టియు కు ఎదురుకాని చేదు అనుభవం ఎదురైంది. చరిత్రలో ఓ గుణపాఠం అని చెపుతున్నారు.

సంఘం విలువలను మరచిన సభ్యులు..

సంఘం నాయకత్వం అంటే విలువలను విడదీయరానివని నమ్ముతారు. పరస్పర గౌరవం, నిజాయితీ, సమగ్రత, వ్యక్తిగత జవాబు దారితనం, నైతికత, నాయకత్వం పెంపొందించడం సంఘం ప్రధానోద్దేశం. సమాజానికి విద్యార్థులకు నీతి వాక్యాలు చెప్పే ఉపాధ్యాయులు సంఘం కట్టుబాట్లకు కట్టుబడి లేక ఇతర సంఘ నాయకులు చెప్పిన మాటలకు లోనై కాసులకు కక్కుర్తి పడి కొందరు ఉపాధ్యాయులు నమ్మకద్రోహం చేయడంతో పిఆర్టియు అభ్యర్థి ఓటమి చవి చూడవలసి వచ్చిందని మండల పిఆర్టియు ఓ సీనియర్ సభ్యుడు ఆవేదన వ్యక్తం చేశారు.

పిఆర్టియు నేతలు అమ్ముడుపోయారు?

ఉపాధ్యాయ నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికల్లో అధిక శాతం ఓటర్లు పిఆర్టియు ఓటర్లను ఉన్నారని ధీమాతో ప్రధాన నాయకులు సభలకు, సమావేశాలకు పరిమితమయ్యారు. గతంలో గెలిచిన పిఆర్టియు నేతలు ఉపాధ్యాయులను పట్టించుకోకపోవడం, కనీస సౌకర్యాలను కల్పించే కల్పించకపోవడంతో సంఘం నాయకులు విఫలం చెందారు. పిఆర్టియు సంఘ నేతలు కొందరు అమ్ముడుపోయాయని అదే సంఘ నేతలు ఆరోపిస్తున్నారు. దీంతో ప్రభుత్వ టీచర్లలో పీఆర్‌టీయూ, ప్రభుత్వంపై వ్యతిరేకత ఏర్పడింది. ఫలితంగా కరీంనగర్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పి ఆర్ టి యు అభ్యర్థి ఓటమి అనివార్యమైంది.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

నవతెలంగాణ-రామారెడ్డి



మండలంలోని ఇసన్నపల్లి గ్రామానికి చెందిన ధర్ని నర్సింలు ఇంటి నిర్మాణానికి చేసిన అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నారు. వారి కుటుంబాన్ని ఎల్లారెడ్డి నియోజకవర్గ శాసనసభ్యులు మదన్మోహన్‌రావు సూచన మేరకు కుటుంబాన్ని పరామర్శించి బాధిత కుటుంబానికి రూ.4000 నగదు, 30 కేజీల బియ్యాన్ని కందూరి పెద్ద లింబాద్రి మంగళవారం అందజేశారు. అప్పు విషయంలో బ్యాంకు అధికారులతో ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు మాట్లాడి న్యాయం చేస్తారని భరోసా కల్పించారు. కార్యక్రమంలో కొక్కొండ రాజేందర్, దర్ని శ్రీనివాస్, రెడ్డి మహిపాల్, దర్నీ మల్లయ్య, కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షల్లో మాల్ ప్రాక్టీస్‌కు తావివ్వొద్దు

- జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

నవతెలంగాణ-కామారెడ్డి

ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా, మాల్ ప్రాక్టీస్‌కు తావివ్వకుండా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. బుధవారం జిల్లా వ్యాప్తంగా 38 సెంటర్‌లలో మొదటి రోజు మొదటి సంవత్సరం పరీక్ష ప్రశాంతంగా జరిగాయి. పరీక్షలో 9230 మంది విద్యార్థులకు గాను 8863 మంది విద్యార్థులు హాజరయ్యారని, 347 మంది విద్యార్థులు గైర్హాజరు అయ్యారని తెలిపారు. ఇందులో జనరల్ గ్రూప్‌లో 7786 మందికి గాను 7555 మంది హాజరుంకాగా, 231 మంది గైర్ హాజరు అయ్యారని తెలిపారు. వొకేషనల్ గ్రూప్‌లో 1444 మంది విద్యార్థులకు గాను 1308 మంది హాజరు కాగా, 116 మంది గైర్ హాజరయ్యారని సూచించారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, శ్రీ ఆర్యభట్ట జూనియర్ కళాశాల కేంద్రాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రాలకు పంపించే సమయంలో ప్రతీ విద్యార్థిని తప్పనిసరిగా పరిశీలించి పంపించాలన్నారు. గడియారాలు, ఎలక్ట్రానిక్ గాడ్జెస్ కూడా అనుమతించ కూడదన్నారు. అనధికార వ్యక్తులను లోనికి పంపించకూడదని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఇంటర్మీడియట్ విద్యా శాఖాధికారి షేక్ సలాం, తదితరులు పాల్గొన్నారు.



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న కామారెడ్డి కలెక్టర్

తడి, పొడి చెత్త వేరుచేసి ఇవ్వాలి



అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ సిబ్బంది

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని 12 వ వార్డు లో తడి చెత్త, పొడి చెత్త, హానికర చెత్తను వేరు చేసి మున్సిపల్ వాహనాలకు ఇవ్వాలని, నిషేధిత ప్లాస్టిక్ కవర్లను వాడకూడదని మహిళలకు బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సానిటరీ ఇన్‌స్పెక్టర్ గజానంద్, పర్యావరణ ఇంజనీర్ పూర్ణమౌళి, వార్డ్ ఆఫీసర్ ప్రవళిక, మెప్మా ఆర్పి తిరుమల, కాలనీ మహిళలు, మున్సిపల్ సిబ్బంది రవి, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు



ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుచేసిన అధికారులు

నవతెలంగాణ-పోతంగల్

మండలంలోని హంగర్గాఫారం, తిరుమలాపూర్ గ్రామాల్లో విద్యుత్తు సమస్య తీర్చడానికి, బుధవారం విద్యుత్ శాఖ అధికారులు 100 కేవీఏ ట్రాన్స్ ఫార్మర్లను ఏర్పాటుచేశారు. హంగర్గఫారం ఎస్సీ కాలనీలో 63 కేవీఏ ట్రాన్స్ ఫార్మర్, కారేగాం పెద్ద పార్కు వద్ద 25 కేవీఏ ట్రాన్స్ ఫార్మర్‌లను అందుబాటులోకి తెచ్చారు. కార్యక్రమంలో డీఈ ఎండీ ముక్తార్, మీరాసాబ్, లైన్ ఇన్స్పెక్టర్ శివప్రసాద్, ఏఈ నర్సారెడ్డి, లైన్మన్ ఖాదర్, సజ్జత్ పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని నాగపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి కమ్మర్ పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పాలెపు నర్సయ్య బుధవారం భూమి పూజ చేసి, పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నర్సయ్య మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టిందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేస్తుందన్నారు. ఇందిరమ్మ ఇండ్ల కోసం ఎవరు ఆందోళన చెందవలసిన అవసరం లేదని, విడతల వారీగా అర్హులైన ప్రతి ఒక్కరికి ఇండ్లు మంజూరు అవుతాయన్నారు. మండలంలో మొట్టమొదటిగా నాగపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టడంపట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సుంకేట రవి, గ్రామ పంచాయతీ కార్యదర్శి సంధ్య, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు కప్పదండి అశోక్, నాయకులు పూజారి శేఖర్, కిషన్, నరేందర్, రాజేశ్వర్, గంగాధర్, శైలేందర్, భూమన్, శివానంద్, తదితరులు పాల్గొన్నారు.

21 నుంచి 25 వరకు అంతర్జాతీయ సదస్సు



బ్రోచర్‌లను విడుదల చేస్తున్న కన్వీనర్ డాక్టర్ ప్రవీణ్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

రిమైనింగ్ అయ్యర్ ఎడ్యుకేషన్ ఇన్ ఇండియా అనే అంశంపై హార్వర్డ్ యూనివర్సిటీ ప్రొఫెసర్లతో అంతర్జాతీయ సదస్సు నిర్వహిస్తున్నామని సదస్సు కన్వీనర్ డాక్టర్ ప్రవీణ్ మామిడాల తెలిపారు. బుధవారం సదస్సు కు సంబంధించిన బ్రోచర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ టి యాదగిరిరావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం యాదగిరి లు మాట్లాడుతూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీ, కెపాసిటీ బిల్డింగ్ ప్రోగ్రాం, సెల్ఫ్ కేర్ అనే అంశాల మీద మార్చి 21 నుండి 25 వరకు తెలంగాణ యూనివర్సిటీ లో అంతర్జాతీయ సదస్సు నిర్వహిస్తున్నమని పేర్కొన్నారు. యునైటెడ్ వే హైదరాబాద్ వారి సౌజన్యంతో జరిగే ఈ కార్యక్రమంలో హార్వర్డ్ యూనివర్శిటీ ప్రొఫెసర్లు డాక్టర్ పావని, డాక్టర్ కాండీసీ, డాక్టర్ షో కి, డాక్టర్ గ్రాబ్రియల్, డాక్టర్ బెన్, డాక్టర్ డోరిస్, శ్రేయ అలెగ్జాండర్లు రిసోర్స్ పర్సన్ గా పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ మావురపు సత్యనారాయణ రెడ్డి, పిఆర్వో డైరెక్టర్ డాక్టర్ ఏ.పున్నయ్య, డాక్టర్ దత్తాహరి, డాక్టర్ నాగరాజ్, డాక్టర్ సంపత్, డాక్టర్ జమీల్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పార్టీ 2025 డైరి ఆవిష్కరణ



డైరి ఆవిష్కరిస్తున్న బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు

నవతెలంగాణ-వర్ని(చందూర్)

మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు మాధవ రెడ్డి ఆధ్వర్యంలో మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ ఆదేశాల మేరకు 2025 సంవత్సర నూతన డైరి, క్యాలెండర్ లను బుధువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు మాధవ రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రైతు రుణమాఫీ కొందరికే ఇచ్చి మిగతా వారికి మొండి చేతు చూపించారని అన్నారు. మహిళలకు 2500, నిరుద్యోగులకు జీవనభృతి, ఆటో డైవర్లకు పారితోషికం ఇస్తామని మాయ మాటలతో కాలం వెల్లడీస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు, రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శ్రీమన్నారాయణ, జి. సంజీవ్, మామూళ్ళ శ్రీను, బర్ల పోశెట్టి, పలు గ్రామాల బి ఆర్ ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

మానసిక ప్రశాంతతకు యోగాసనాలు ఔషధం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఒత్తిడి సమాజంలో మానసిక ప్రశాంతతకు యోగాసనాలు ఔషధంలాగ పనిచేస్తున్నాయని, క్రమం తప్పకుండ యోగాసనాలు అభ్యసనం చేయాలని డైరెక్టర్ డాక్టర్ భ్రమరాంబిక అన్నారు. తెలంగాణ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ టి యాదగిరిరావు ఆదేశాల మేరకు ఉమెన్ సెల్ డైరెక్టర్ డాక్టర్ భ్రమరాంబిక ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని ఆరోగ్య రక్ష నేచర్ క్యూర్ యోగా సెంటర్ యోగా థెరపిస్ట్ ఐశ్వర్య తెలంగాణ యూనివర్సిటీ లో అధ్యాపకులకు విద్యార్థినిలకు బుధవారం యోగాసనాల పట్ల అవగాహన కల్పించి ఆసనాలు వేయించారు.

మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల నిరోధానికి కృషి చేయాలి

- అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్

నవతెలంగాణ-కంఠేశ్వర్

సమాజానికి పెను సవాలుగా మారిన మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాల నిరోధానికి సంబంధిత శాఖల అధికారులు కలిసికట్టుగా కృషి చేయాలని అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో అదనపు కలెక్టర్ నేతృత్వంలో బుధవారం జిల్లా స్థాయి మాదకద్రవ్యాల నిరోధక కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లాలో మాదకద్రవ్యాల వినియోగం, రవాణా తదితర అంశాలపై సమావేశంలో చర్చించి, వాటి నియంత్రణకు చేపట్టాల్సిన చర్యల గురించి పలు నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలపై ఉక్కుపాదం మోపేందుకు అధికారులు సమన్వయంతో మరింత గట్టిగా పని చేయాలని అన్నారు. మాదకద్రవ్యాల వినియోగం, రవాణాపై గట్టి నిఘా పెడుతూ, వాటిని పూర్తి స్థాయిలో అరికట్టేందుకు అంకితభావంతో కృషి చేయాలని హితవు పలికారు. ముఖ్యంగా రోడ్డు, రైలు మార్గాల ద్వారా వీటిని



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్

రవాణా చేసే అవకాశాలు ఉన్నందున ఆర్టీసీ, రైల్వే అధికారులు అవసరమైన చర్యలు చేపట్టాలని, తనిఖీ కేంద్రాల వద్ద గట్టి నిఘా ఉంచాలని అన్నారు. గంజాయి వంటి మత్తు పదార్థాలు ఎక్కడి నుండి జిల్లాకు చేరుతున్నాయి, ఏయే ప్రాంతాల్లో ఎవరు వీటిని విక్రయిస్తున్నారు, ఏ ప్రాంతాలకు జిల్లా మీదుగా రవాణా జరుగుతోంది, స్థానికంగా ఎక్కడైనా గంజాయిని అంతర పంటగా సాగు చేస్తున్నారా అనే వివరాలకు పక్కాగా గుర్తిస్తూ, వాటి మూలాలను అడ్డుకోగలిగితే చాలా వరకు మత్తు పదార్థాల వినియోగాన్ని నియంత్రించవచ్చని సూచించారు. కల్తీ కల్లు తయారీ కోసం వినియోగించే ఆల్ప్రాజోలం నిల్వల గురించి ఆరా తీసి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ దిశగా పోలీస్, ఎక్సయిజ్, రవాణా తదితర శాఖలు సమన్వయంతో ముందుకెళ్లాలని అదనపు కలెక్టర్ హితవు పలికారు. ఈ సమావేశంలో అదనపు డీసీపీ బస్వారెడ్డి, ఎక్సయిజ్ సూపరింటెండెంట్ మల్లారెడ్డి, డీఎంహెచ్‌ఓ డాక్టర్ రాజశ్రీ, వ్యవసాయ శాఖ అధికారి వాజిద్ హుస్సేన్, జిల్లా రవాణా శాఖ అధికారి ఉమామహేశ్వర్ రావు, అటవీ, వాణిజ్య పన్నులు, ఔషధ నియంత్రణ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

బాలికలు అన్ని రంగాల్లో ముందుండాలి

- జిల్లా సంక్షేమ అధికారిని ఎస్.కే రసూల్ బీ

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

బాలికలు అన్ని రంగాల్లో ముందుండాలని జిల్లా సంక్షేమ అధికారిని ఎస్.కే రసూల్ బీ అన్నారు. బుధవారం మండలంలోని కొన సముందర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భీంగల్ ఐసిడిఎస్ ఆధ్వర్యంలో బాలిక దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న జిల్లా సంక్షేమ అధికారిని రసూల్ బీ మాట్లాడుతూ బాలికల అన్ని రంగాల్లో ముందుండాలని, ప్రభుత్వం అందించే సదుపాయాలను సద్వినియోగం చేసుకుంటూ జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. బాలికల విలువలను, ప్రాముఖ్యతను వివరించారు. పిల్లలపై సోషల్ మీడియా ప్రభావం, చదువు యొక్క ప్రాముఖ్యత, బాలికలు ఉన్నత స్థానానికి వెళ్లడనికి ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలు, సదుపాయాలపై అవగాహన కల్పించారు. భీంగల్ ఐసిడిఎస్ సీడీపీఓ స్వర్ణలత మాట్లాడుతూ బాలికల హక్కులు, చట్టాల గురించి వివరించారు. బాల్య వివాహాలు, పోక్సో చట్టం, పిసిపిఎన్ డిటి చట్టం, హెల్ప్ లైన్స్, లింగ వివక్షతను రూపుమాపడం, గుడ్ టచ్-బాడ్ టచ్, తదితరాంశాలపై బాలికలకు అర్థమయ్యేలా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో భాగంగా పిల్లల్లకు వ్యాసరచనలు, డ్రాయింగ్ పోటీలు నిర్వహించి, గెలుపొందిన బాలికలకు బహుమతులు



ప్రతిజ్ఞ చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

అందజేశారు. కార్యక్రమంలో ఏసీడీపీఓ జ్ఞానేశ్వరి, మండల పర్యవేక్షకురాలు గంగ హంస, డి హెచ్ ఈ డబ్ల్యూ సౌమ్య, ఐసిపిఎస్ చైతన్య, అంగన్వాడీ టీచర్లు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు నరసయ్య, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌వోసి అందజేత



ఎల్‌వోసి అందుకున్న బాధితుడు

నవతెలంగాణ-మోర్తాడ్

మండలంలోని దొనకల్ గ్రామానికి చెందిన ప్రవీణ్ అనారోగ్యంతో హైదరాబాద్ ఆసుపత్రిలో చికిత్స పొందగా అతనికి రెండు లక్షల 50 వేల రూపాయల ఎల్వోసి అందజేసినట్లు తెలిపారు. గుండె సంబంధిత వ్యాధితో హైదరాబాద్ ఆస్పత్రిలో చికిత్స పొందగా వైద్య పరీక్షల నిమిత్తం రెండు లక్షల 50 వేల రూపాయల ఎల్‌ఓసిని స్థానిక కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్ రెడ్డి మంజూరు చేయించినట్లు తెలిపారు. ఈమేరకు బాధితునికి బుధవారం ఎల్‌వోసీని అందజేశారు.

సమన్వయం పాటించండి

- పీఏసీఎస్ చైర్మన్ జక్క రాజేశ్వర్..



నవతెలంగాణ-ముప్కాల్

బాల్కొండ నియోజకవర్గంలోని ముప్కాల్ మండల కేంద్రంలో గతకొద్ది రోజులుగా అనునిత్యం మాజీ ప్రజాప్రతినిధుల మధ్య జరుగుతున్న 'వ్యక్తిగత కక్ష్య సాధింపు' రాజకీయ సమీకరణాలతో ముడిపడడం వల్ల మండలంలో విధులు నిర్వర్తిస్తున్న ఆయా శాఖల అధికారులకు, మండల ప్రజలకు 'ప్రజాపాలన'లో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, వేంపల్లి పీఏసీఎస్ ఛైర్మన్ జక్క రాజేశ్వర్ తన అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. స్థానిక అధికారులు మండలంలో విధులు నిర్వహించే క్రమంలో వ్యక్తిగత సెలవులు పెట్టి దూరంగా ఉండటం, బదిలీపై వెళ్తే మరొకరు ఇక్కడికి రావడానికి అయిష్టాన్ని చూపుతున్నారని అన్నారు. ఈ విషయాన్ని మాజీ ప్రజాప్రతినిధులు ఒక్కసారి సమన్వయంతో ఆలోచించి స్నేహాభావంతో కలిసి మెలిసి ఉండాలని ఆకాంక్షించారు. రాజకీయ పరిణా మాలతో మన మండలంలో అభివృద్ధి పనులు పెండింగులో ఉండే అవకాశం కూడా ఉందని గుర్తుచేశారు. కావున వ్యక్తిగత దూషణలను పక్కన బెట్టి మండ౦ల అభివృద్ధి కార్యక్రమాలపై దృష్టి పెట్టాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

బయోటెక్నాలజీ పరిశోధనలతో బహుముఖ ప్రయోజనాలు

- వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ టి. యాదగిరి రావు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

వర్తమాన కాలంలో మానవ సమాజం ఈ విభాగముతో బహుముఖ ప్రయోజనాలు పొందుతుందన్నారి, వ్యవసాయ రంగంలో నూతన వంగడాల సృష్టికి, పారిశ్రామిక రంగంలో అధిక ఉత్పత్తికి, వైద్యరంగంలో అనేక వ్యాధుల నివారణకు ఈ శాస్త్రం కృషి చేస్తుందని వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ టి యాదగిరి రావు పేర్కొన్నారు. బుధవారం తెలంగాణ యూనివర్సిటీ బయోటెక్నాలజీ విభాగంలో బయోటెక్నాలజీకల్ ప్రయోగాల ప్రదర్శనపై ఒకరోజు సదస్సు విభాగాధిపతి, సదస్సు కన్వీనర్ డాక్టర్ ప్రసన్నశీల అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ టి యాదగిరి రావు పాల్గొని మాట్లాడుతూ బయో టెక్నాలజీ నూతనంగా ఆవిష్కరించిన ఆధునిక శాస్త్రం అని పేర్కొన్నారు. కోవిడ్ మహమ్మారి లాంటి ప్రాణాంతక వైరస్ ను నశింపజేయడానికి భారత్ బయోటెక్నాలజీ సంస్థ వ్యాక్సిన్ తయారు చేసి ప్రపంచ వ్యాప్తంగా కోవిడ్ మహమ్మారి నుండి ప్రాణాలు కాపాడిందని గుర్తు చేశారు. అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ వృద్ధికి బయోటెక్నాలజీ పరిశోధనలు కీలకంగా ఉపయోగపడతాయని తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్. ఎం.యాదగిరి పాల్గొని మాట్లాడుతూ శాస్త్ర సాంకేతిక రంగాల అభివృద్ధితో భారతదేశం వికసిత భారత్ లక్ష్యంగా ముం దుకు పోతుంద న్నారు. విద్యార్థులు తమ లక్ష్యా లను ఏర్పాటు చేసుకోవ డానికి ఈ సదస్సు ఎంతగానో దోహదం చేస్తుందన్నారు. ప్రిన్సిపా ల్ డాక్టర్ ప్రవీణ్ మామిడాల మాట్లాడుతూ కృత్రి మ వంగడాల సృష్టి తో బయోటెక్నాలజీ అద్భుతా లు సృష్టిస్తుం దన్నారు. వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ మావురపు సత్యనారాయణ రెడ్డి కో-కన్వీనర్ డాక్టర్ కిరణ్మయి, డాక్టర్ మహేందర్ ఐలేని డాక్టర్. జెవేరియా, డాక్టర్ ప్రసన్న తో పాటుగా వివిధ కళాశాల నుండి 350 విద్యార్థులు అధ్యాపకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సదస్సు కన్వీనర్ బయోటెక్నాలజీ విభాగాధిపతి డాక్టర్ ప్రసన్న శీల మాట్లాడుతూ ఈ ప్రయోగాల ప్రదర్శన సదస్సుకు అనుబంధ కళాశాలల విద్యార్థులు హాజరయ్యారు.



మాట్లాడుతున్న వైస్ ఛాన్సలర్

ఇంటర్ పరీక్షలు ప్రారంభం



నవతెలంగాణ-బాల్కొండ

రాష్ట్రవ్యాప్తంగా ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో బాల్కొండ మండల పరిధిలోని రెండు కేంద్రాల్లో పరీక్షలు జరిగాయి. పరీక్ష సందర్భంగా ఉదయం 8 గంటల నుంచే విద్యార్థులు ఉరుకుల పరుగుల మీద పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. విద్యాధికారులు విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసిన అనంతరం పరీక్ష కేంద్రంలోనికి అనుమతించారు. మోడల్ స్కూల్ పరీక్ష కేంద్రంలో 361 విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 8 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రంలో 275 మంది విద్యార్థులకు గాను పూర్తిగా హాజరు విద్యార్థులు హాజరయ్యారు. మొదటి రోజు పరీక్ష ప్రశాంతంగా జరిగిందని చీఫ్ సూపరింటెండెంట్లు శ్రీనివాస్ ప్రసాద్, రెహమాన్ తెలిపారు.

రేవంత్ డైవర్షన్ రాజకీయాలకు బుద్ధి చెప్పే సమయం వచ్చింది

- అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

రేవంత్ రెడ్డి డైవర్షన్ రాజకీయాలకు తగిన బుద్ధి చెప్పే సమయం వచ్చిందని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ అన్నారు. బీజేపీ జిల్లా కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తీవ్ర విమర్శలు చేశారు. సిఎం రేవంత్ రెడ్డి ప్రజా సమస్యలపై దృష్టి పెట్టకుండా డైవర్షన్ రాజకీయాలను నడిపిస్తున్నారని విమర్శించారు. ఎస్ఎల్‌బిసి ఘటన, శాంతి భద్రతల సమస్య, ప్రజా తిరుగుబాటు, బీజేపీ ఎదుగుదల %-% ఇవన్నీ ఓర్చుకోలేక కిషన్ రెడ్డి పై అసత్య ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. కిషన్ రెడ్డి కృషి వల్లే మామూనూరు ఎయిర్ పోర్ట్, కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్, రామగుండం ఎరువుల పునరుద్ధరణ, సమ్మక్క-సరళమ్మ ట్రైబల్ యూనివర్సిటీ వంటి ప్రాజెక్టులకు కేంద్రం మద్దతు అందించిందని స్పష్టం చేశారు. బీజేపీ 8 ఎమ్మెల్యేలు, 8 ఎంపీలు, ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం సాధించడంతో రేవంత్ రెడ్డి ఓర్వలేక దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు అని అన్నారు. తెలంగాణలో అభివృద్ధి ప్రాజెక్టులకు బీజేపీ అడ్డుపడిందా? రేవంత్ రెడ్డి స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. 'ఓటుకు నోటు' కేసులో దొరికినవారు బీజేపీ గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ అవినీతి బహిర్గతం చేస్తామని హెచ్చరించారు. బీజేపీ మాత్రమే తెలంగాణ అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి కట్టుబడి ఉందని, రేవంత్ రెడ్డి డైవర్షన్ రాజకీయాలకు తగిన బుద్ధి చెప్పే సమయం వచ్చిందని కార్యకర్తలు విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా నాయకులు, మండల అధ్యక్షులు, మాజీ కార్పొరేటర్లు, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అర్బన్ ఎమ్మెల్యే

అయ్యప్పస్వామి దేవాలయంలో అన్నదానం



అన్నదాత దంపతులను సన్మానించిన ఆలయ కమిటీ సభ్యులు

నవతెలంగాణ-ఏర్గట్ల

ఏర్గట్ల మండలకేంద్రంలోని అయ్యప్పస్వామి దేవాలయంలో బుధవారం బద్దం వేల్పూర్ లింగారెడ్డి, విజయ దంపతులు భక్తులకు అన్నదానం నిర్వహించారు. అయ్యప్ప ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ... నెలలో మొదటి బుధవారం దాతలు అన్నదానం నిర్వహిస్తారని ఇందులో భాగంగా వేల్పూర్ లింగారెడ్డి, విజయ దంపతులు ఈ వారం అన్నదానం నిర్వహించారని తెలిపారు. ఈ సందర్భంగా అన్నదానం నిర్వహించిన దంపతులను ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు.

ఎస్బిఐ ఏటిఎం దగ్గర నుంచి పల్సర్ బైక్ చోరీ

నవతెలంగాణ-కంఠేశ్వర్

నగరంలోని ఒకటవ పోలీస్ స్టేషన్ పరిధిలో ద్విచక్ర వాహనం చోరీ అయినట్లు నిజామాబాద్ ఒకటవ టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి బుధవారం తెలిపారు. ఎస్హెచ్ఓ రఘుపతి తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్‌లో ముస్తాయి పురాకు చెందిన షేక్ అహ్మద్ బిజినెస్ పని నిమిత్తం నిజామాబాద్ ఆర్టీసీ బస్టాండ్ ఎస్బిఐ ఏటిఎం వద్ద తన పల్సర్ బండి పార్క్ చేసి ఏటీఎంలోకి వెళ్లి కొద్దిసేపటి తర్వాత తిరిగి వచ్చి చూసేసరికి తన పల్సర్ బైక్ కనిపించలేదు. గుర్తు తెలియని వ్యక్తులు దొంగలించుకుని పోయారని ఒకటవ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఒకటవ పోలీస్ స్టేషన్ ఎస్ హెచ్ ఓ తెలిపారు.

పరీక్షలంటే భయపడొద్దు.. గుడ్‌లక్



నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

తెలంగాణ ఆదర్శ పాఠశాల, కళాశాల జక్రాన్‌పల్లిలోని పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు బుధవారం గుడ్‌లక్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పాఠశాలను అడిషనల్ డైరెక్టర్ శ్రీనివాస్ చారి, డిప్యూటీ డైరెక్టర్ దుర్గాప్రసాద్ సందర్శించారు. పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడి విద్యార్థులకు పరీక్షలపైన అవగాహన కల్పించి పరీక్షల భయం, పరీక్ష రాసే విధానం గురించి సలహాలు, సూచనలు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ సుధారాణి, కంచరి రవికుమార్ ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కామారెడ్డి
గురువారం | మార్చి 06, 2025 | www.navatelangana.com

వీడ్కోలు, వార్షిక దినోత్సవం

నవతెలంగాణ-పోతంగల్

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వీడ్కోలు, వార్షిక దినోత్సవం బుధవారం నిర్వహించారు. పిఆర్‌టియు వారు మండలంలోని అన్ని పాఠశాలలో చదువుతున్న పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష అట్టలను పంపిణీ చేశారు. విద్యార్థుల సంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ముఖ్య అతిథి తహసీల్దార్ గంగాధర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో అన్ని వసతులు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకుని, జీవితంలో ఎదగాలన్నారు. ఎంఇఓ ఎల్. శంకర్ మాట్లాడుతూ.. తాను చదువుకున్నప్పటి దినాలను నెమరువేసుకుని, విద్యార్థులకు విద్యతో పాటు ఆటలు, సంస్కృతిక కార్యక్రమాలు ముఖ్యమని తెలిపారు. హెచ్ఎం సాయిలు మాట్లాడుతూ.. పదవ తరగతిలో 89 విద్యార్థులు పరీక్షలు 21 నుంచి బోర్డు పరీక్షలకు హాజరవుతారని, 100శాతం ఉత్తీర్ణత సాధించాలని, ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారని తెలిపారు. పిఆర్‌టియు ఉపాధ్యాయ సంఘాలు అన్నివిధాలా విద్యార్థులకు అండగా ఉంటుందని మండలాధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గ్రామ ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాలకు తమవంతు సహాయ, సహకారాలంది స్తామన్నారు.

100శాతం ఇంటి పన్ను వసూలు చేయాలి

• ఎంపీడీవో రాజ్ కిరణ్‌రెడ్డి

నవతెలంగాణ-భిక్కనూర్



మండలంలోని 18 గ్రామపంచాయతీలలో ఆర్థిక సంవత్సరం మార్చి నెల ముగిసేసరికి 100శాతం శాతం ఇంటి పన్నులు వసూలు చేయాలని ఎంపిడిఓ రాజ్ కిరణ్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయా గ్రామాలలో పంచాయతీ కార్యదర్శులు ఇంటి పన్నులు వసూలు కార్యక్రమం నిర్వహించారు. గ్రామస్తులందరూ సకాలంలో ఇంటి పన్నులు చెల్లించి గ్రామ అభివృద్ధికి సహకరించాలని కార్యదర్శులు సూచించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, పంచాయతీ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు

• తొలిరోజు ప్రశాంతం

నవతెలంగాణ-భిక్కనూర్

పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం మొదలైన ఇంటర్మీడియట్ మొదటి సంవత్సర పరీక్షలు మొదటి రోజు ప్రశాంతంగా ముగిసింది. మొత్తం విద్యార్థులు 228 ఉండగా ఇందులో 3 విద్యార్థులు గైర్హాజరైనట్టు జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జ్యోతిర్మని రాధాదేవి తెలిపారు. విద్యార్థులు పరీక్ష సమయంలో అనారోగ్యానికి గురైతే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో పరీక్ష కేంద్రం వద్ద వైద్య సేవలు, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. ముందస్తు చర్యలో భాగంగా పరీక్షలు నిర్వహిస్తున్న సమయంలో మాస్ కాఫీ పాల్పడకుండా పోలీస్ శాఖ వారు జిరాక్స్ సెంటర్‌లను మూసి వేయించారు.

గాంధారి : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు నిర్వహించారు. మొత్తం విద్యార్థులు 124 ఉండగా ఇందులో 6 గైర్హాజరు అయ్యారు. పరీక్ష కేంద్రానికి ఫ్లయింగ్ స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్, తహసీల్దార్ సతీష్‌రెడ్డి, ఎస్సై ఆంజనేయులు కళాశాలను సందర్శించారు. మొదటిరోజు పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయని కళాశాల ప్రిన్సిపాల్ గంగారం తెలిపారు.

జుక్కల్ : మండలంలోని ప్రభుత్వ కళాశాలలో ఇంటర్ మీఇయట్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. మొదటి రోజు పరీక్షలకు మొత్తం విద్యార్థులు 137 ఉండగా ఇందులో 15 మంది గైర్హాజరయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాల ఆవరణలో 144 సెక్షన్ విధించి పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించేందుకు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

పిట్లం : ఇంటర్మీడియట్ మొదటి సంవత్సర పరీక్షలు బుధవారం ప్రారంభించారు. మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రం వద్దకు విద్యార్థులు ఉదయం 8 గంటల సమయానికి చేరుకోగా పరీక్ష నిర్వాహకులు అరగంట ముందే పరీక్ష హాల్‌లోకి అనుమతించారు. ఇంటర్ ఫస్టియర్ మొత్తం విద్యార్థులు 194 ఇందులో ఇద్దరు విద్యార్థులు కళాశాలకు సక్రమంగా హాజరు కానందున వారిని పరీక్షలకు అనుమతించలేదని పరీక్షల చీఫ్ సూపర్ డెంట్ నరేష్ తెలిపారు.



తాడ్వాయిలో..



నిజాంసాగర్‌లో..

తాడ్వాయి : ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు మండల కేంద్రంలోని బాలికల గురుకుల పాఠశాలలో ప్రశాంతంగా నిర్వహించారు. మొత్తం విద్యార్థులు 155 ఉండగా ఇందులో ఒకరు గౌర్హాజరు అయినట్టు డిపార్ట్మెంటల్ అధికారిని సుజాత తెలిపారు. పరీక్ష కేంద్రం వద్ద 144 సెక్షన్ విధించినట్టు ప్రిన్సిపాల్ బి.సురేఖ తెలిపారు.

లింగంపేట్ : ఇంటర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు గాను 285 మందికి గాను 221 విద్యార్థులు హాజరయ్యారు. 6 గురు గైర్హాజరయ్యారు. మొత్తం మొదటి రోజు 10 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని పరీక్షల చీఫ్ సూపర్ ఇండెంట్ దుర్గయ్య తెలిపారు. పరీక్షల కేంద్రానికి అరగంట ముందే విద్యార్థులు రావాలని ఆయన సూచించారు.

నిజాంసాగర్ : మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం మొదటి పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని పరీక్ష కేంద్రం చీఫ్ సూపరిండెంట్ శివకుమార్ తెలిపారు. మొత్తం 201 మంది విద్యార్థులు పరీక్ష రాయల్సి ఉండగా 189 మంది విద్యార్థులు పరీక్ష రాసారని, 12 మంది విద్యార్థులు పరీక్షకు గైర్హాజర్ అయ్యారని ఆయన తెలిపారు.

ఆరుగురు విద్యార్థులు గైర్హాజరు..

దోమకొండ : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ వార్షిక పరీక్షలకు, జనరల్ విద్యార్థులు 128 మంది హాజరు అవ్వాల్సి ఉండగా 123 మంది విద్యార్థులు హాజరయ్యారని, 5మంది విద్యార్థులు గైర్హాజరు అయ్యారని, ఒకేషనల్ 56 విద్యార్థులు పరీక్షకు హాజరవలసి ఉండగా, 55 విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారని, ఒకరు గైర్హాజరు అయ్యారని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ శంకర్ తెలిపారు.

రామారెడ్డి : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొదటి రోజు ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం విద్యార్థుల పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. 101 మంది విద్యార్థులకు గాను 99 మంది విద్యార్థులు అజరాయ్యరు. ఇద్దరు విద్యార్థులు గైర్హాజరైనట్టు ఇంచార్జ్ రమేష్ తెలిపారు.

అత్యవసర పరిస్థితిలో రక్తం అందజేత

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డిలోని ఓ ప్రైవేట్ హాస్పత్రిలో రక్తహీనతతో చికిత్స పొందుతున్న శృతికీ అత్యవసర పరిస్థితిలో రక్తం అవసరం కావడంతో భిక్నూర్ మండల కేంద్రానికి చెందిన బక్కన్నగారి భాస్కర్ ముందుకు వచ్చి రక్తదానం చేసినట్టు జిల్లా రక్తదాతల సేవా సమితి నిర్వాహకులు బోనగిరి శివకుమార్, ముదాం శ్రీధర్ పటేల్‌లు తెలిపారు. ఈ సందర్భంగా అత్యవసరంగా రక్తదానం చేసిన రక్తదాతను జిల్లా రక్తదాతల సేవా సమితి నిర్వాహకులు వారిని అభినందించారు. కార్యక్రమంలో బ్లడ్ సెంటర్ ప్రతినిధులు పాల్గొన్నారు.

బాధితులకు ఫోన్‌లు అందజేత



ఫోన్‌లను అందజేస్తున్న ఎస్సై అనిల్ కుమార్

నవతెలంగాణ-మాచారెడ్డి (కామారెడ్డి)

మాచారెడ్డి పోలీస్ స్టేషన్ పరిధిలో తమ ఫోన్‌లను పోగొట్టుకున్న బాధితులకు ఎస్సై అనిల్ కుమార్ వారి ఫోన్‌లను వారికి బుధవారం అప్పజెప్పారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. మండలంలోని సోమార్పేట గ్రామానికి చెందిన జజ్జరి అజయ్, మాచారెడ్డి ఎక్స్‌రోడ్‌కు చెందిన బుడిగి ఎల్లాగౌడ్ బాధితుల ఫోన్‌లను సీఈఐఆర్ యాప్ ద్వారా ట్రాక్‌చేసి పట్టుకొని వారికి అప్పచెప్పినట్టు తెలిపారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని తిప్పాపూర్ గ్రామంలో ఉపాధి హామీ పనులను ఎంపీడీవో రాజ్ కిరణ్‌రెడ్డి బుధవారం పరిశీలించారు. అర్హత ఉన్నవారికి జాబ్ కార్డు అందజేసి ఉపాధి హామీ పని కల్పించాలని పంచాయతీ కార్యదర్శి శ్రీధర్‌కు సూచించారు. కొలతల ప్రకారం కూలీలకు డబ్బులు చెల్లించి ఎలాంటి అవకతవకలు పాల్పడకుండా చర్యలు తీసుకోవాలని, కూలీల పనుల రికార్డులు నమోదు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, ఉపాధి హామీ కూలీలు, తదితరులు ఉన్నారు.

అఖండ హరి నామ సప్తహ ముగింపు

నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని పడంపల్లి గ్రామంలో శివరాత్రి పండుగ నుంచి నిర్వహిస్తున్న అఖండ హరినామ సత్తా కార్యక్రమం బుధవారం ముగింపు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గత 7 రోజుల నుంచి గ్రామంలో సప్తహ కార్యక్రమంలో భజనలు, కీర్తనలు, యువత చెడుదోవ పట్టకుండా పలు ప్రవచనాలు, ప్రజలు జీవించవలసిన విధానాలను, పలు అంశాలను కీర్తన, ఉపన్యాసం, రూపంలో తెలియజేయడం జరిగింది. కీర్తన కార్యక్రమంలో కంతాలి గ్రామానికి చెందిన సంగయ్య తన కీర్తనలను ప్రజలకు భక్తులకు వినిపించారు. కార్యక్రమంలో పడంపల్లి గ్రామ పెద్దలుశ, యువకులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

బీసీ హాస్టల్‌ను పరిశీలించిన బీసీ సంఘం జిల్లా అధ్యక్షులు

నవతెలంగాణ-నిజాంసాగర్

మండలంలోని ప్రభుత్వ వెనుకబడిన వసతిగృహంలో బీసీ సంఘం జిల్లా అధ్యక్షులు చింతల శంకర్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హాస్టల్లో ఉన్న సమస్యలు మా దృష్టికి రావడంతో హాస్టల్‌ను బుధవారం సందర్శించి పలు సమస్యలను గుర్తించినట్టు తెలిపారు. హాస్టల్లో విద్యార్థులకు తాగునీటి వసతి సరిగా లేదు కులాయి పరిశుభ్రంగా లేకపోవడం, స్థానాల గదులు సరిగా లేకపోవడం, బాత్రూం క్లీన్ గా లేకపోవడం పలు సమస్యలను గుర్తించినట్టు తెలిపారు. ప్రభుత్వం స్పందించి విద్యార్థులకు అన్ని సదుపాయాలను అందించాలని నూతన వసతి గృహాలు నిర్మించి దాని చుట్టూ ప్రహరీ గోడ నిర్మించాలని, వసతి గృహానికి పర్మినెంట్ వార్డెన్ ను నియమించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు లోక సంతోష్, జిల్లా యువజన అధ్యక్షుడు శ్రవణ్ కుమార్ గౌడ్, జుక్కల్ కాన్సెన్సీ ఇంచార్జ్ ఆకుల లక్ష్మణ్ యాదవ్, నిజాంసాగర్ మండల ఇంచార్జ్ నాగరాజు, నిజాంసాగర్ మండల అధ్యక్షుడు గాజుల చంద్రశేఖర్ పిట్లం మండల సోషల్ మీడియా ఇంచార్జ్ అప్రోచ్ తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రీయ పరిజ్ఞానం పెంచేందుకు టిఎల్ఎమ్ మేళా



టీఎల్ఎం మేళాలో పలురకాల ప్రయోగాలను ఏర్పాటుచేసిన విద్యార్థులు

నవతెలంగాణ-గాంధారి

మండలంలోని పొతంగల్ కాలన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కాంప్లెక్స్ పరిధిలోని టిఎల్ఎం మేళను బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా విద్యాధికారి రాజు మేళాను ప్రారంభించారు. విద్యార్థులు బోధన అభ్యాస సామాగ్రి, ప్రయోగాల ద్వారా విద్యా బోధన చేస్తూ శాస్త్రీయ వైఖరి అలవర్చుకొని భావిభారత శాస్త్రవేత్తలుగా తయారు కావాలని కోరారు.

కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు గన్నమనేని రంగారావు మాట్లాడుతూ.. కాంప్లెక్స్ పరిధిలోని అన్ని పాఠశాలల విద్యార్థులకు శాస్త్రీయ పరిజ్ఞానం అందించడానికి ఈ టిఎల్ఎం మేళను నిర్వహించామని తెలిపారు. కాంప్లెక్స్ పరిధిలోని పాఠశాల విద్యార్థులు తమకు అవసరం ఉన్నప్పుడు ఇక్కడి ల్యాబ్, ఐఎఫ్‌పి ప్రొజెక్టర్ ఉపయోగించుకొని నాణ్యమైన విద్యను పొందాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో వివిధ పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజేందర్, శ్రీహరి, రజని నాగవేణి, సాయిన్న, సంతోషి, సంధ్య, రాజ్ కుమార్, సాయి, ప్రశాంత్, ఉపాధ్యాయులు సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో జీవిత లక్ష్యం ఉండాలి

• ఇంపాక్ట్ సర్టి ఫైడ్ రమేష్ చైతన్య

నవతెలంగాణ-తాడ్వాయి

విద్యార్థుల్లో జీవిత లక్ష్యం కలిగి ఉండాలని ఇంపాక్ట్ సర్టి ఫైడ్ రమేష్ చైతన్య అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని బాలికల గురుకుల పాఠశాలలో 7, 10వ తరగతి విద్యార్థులకు హాలో వ్యక్తిత్వ వికాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు విద్యార్థి దశ నుండే తమకు ఇష్టమైన రంగాన్ని ఎంచుకొని తమ ఎంచ్నుకున్న లక్ష్యంతో ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సురేఖ, అనూష, ఉమా, భాను జ్యోతి, రమేష్, సిఆర్‌పిలు నర్సింలు, రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

మానసిక ఒత్తిడిని జయించాలి

నవతెలంగాణ-కామారెడ్డి

విద్యార్థులు మానసిక ఒత్తిని జయించాలంటే నిబంధనలు పాటించాల్సిందేనని జిల్లా మానసిక వైద్యాధికారి డా.జి.రమణ అన్నారు. బుధవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో మానసిక ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించినట్టు స్పెషల్ ఆఫీసర్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా మానసిక వైద్యాధికారి డాక్టర్.జి.రమణ హాజరయ్యారని పేర్కొన్నారు. ఆ సందర్భంగా డాక్టర్ రమణ మాట్లాడుతూ.. పరీక్షల కాలంలో విద్యార్థులు ఎవ్వరూ మానసిక ఒత్తిడికి గురికావద్దని ప్రణాళిక బద్ధంగా చదువుకోవాలని సూచించారు. పరీక్షా సమయానికి మానసిక సమస్యలు తలెత్తడం సహజమని వాటిని అధిగమించినప్పుడే అనుకున్న లక్ష్యాలను ఛేదించగలమని వివరించారు. కఠినమైన సబ్జెక్టులను ముందుగా ప్రణాళిక వేసుకొని అర్థం కాని వాటిని ఉపాధ్యాయులనడిగి సందేహాలు నివృత్తి చేసుకోవాలన్నారు. పరీక్షల సమయంలో విద్యార్థులకు సరైన మోతాదులో ఆహారం, సరైన నిద్ర మానసిక ప్రశాంతత అత్యవసరమని తెలిపారు. మానసిక ప్రశాంతత కొరకు యోగా మెడిటేషన్ వ్యాయామం లాంటివి చేయాలన్నారు. కార్యక్రమంలో కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ మైశకళ, జిల్లా సోషల్ వర్కర్ డాక్టర్ రాహుల్, ఎంఎల్‌హెచ్‌పి శ్రీకాంత్, ఉపాధ్యాయులు గీత, సంధ్యారాణి, కళావతి, గంగ, మమత, ఆశా కార్యకర్త ఇందిరా, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

మహాలక్ష్మి పథకాన్ని అమలు చేయాలి

• త్వరగా అమలు చేయాలని కోరుతున్న అతివలు

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

ఆరు గ్యారంటీల్లో భాగంగా అర్హులైన మహిళలకు ప్రతి నెల రూ.2,500 చొప్పున ఆర్థిక సాయం అందించడానికి నిర్దేశించిన మహాలక్ష్మి పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ఇంకా పచ్చజెండా ఉపలేదు. ఫలితంగా ఈ పథకం కింద సాయం కోసం ఎంతోమంది మహిళలు నిరీక్షిస్తున్నారు. ప్రధానంగా ఆసరా పథకం కింద పింఛన్ అందుకోలేని మహిళలు తమకు మహాలక్ష్మి సాయం కొండంత అండగా ఉంటుందని ఆశతో ఎదురు చూస్తున్నారు. 2024-25 సంవత్సరానికి గాను ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆరు గ్యారంటీల కోసం ప్రభుత్వం రూ.53.196 కోట్లను కేటాయించింది. ఆసరా కింద మండలంలో మొత్తం మహిళ ఓటర్లు 11,230 ఉన్నారు. ఇందులో 16,40 మంది వితంతువులు, 34 మంది ఒంటరి మహిళలు, 180 వికలాంగులు, 789 వృద్ధాప్య మహిళలు ప్రతి నెల పింఛన్‌లు అందుకుం టున్నారు. ఆసరా పింఛన్‌లు అందుకోలేని మహిళలు మహాలక్ష్మి సాయం ద్వారా లబ్ది పొందవ చ్చని భావిస్తున్నారు. ఇప్పటి వరకు మార్గదర్శకాలను రూపొందించకపోవడంతో మహాలక్ష్మి సాయం ఎంతమందికి వస్తుంది. ఎవరు అర్హులు అనే విషయం తేలుతుంది. అసలు మహాలక్ష్మి పథకం అమలు చేస్తారా లేదా అనే అంశంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటి వరకు క్షేత్రస్థాయిలో ఎలాంటి సర్వేలు జరపకపోవడం, అర్హుల ఎంపికకు చర్యలు తీసుకోకపోవడంతో పథకం అమలుపై నీలినీడలు కమ్ముకున్నాయి. పార్లమెంట్ ఎన్నికల తంతూ ఎలాగూ ముగిసిపోయింది. మరో నాలుగైదు రోజుల్లో కోడ్ ఎత్తివేసే అవకాశం ఉంది. ఇప్పటికైనా మహాలక్ష్మి సాయంపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలని పలువురు మహిళలు కోరుతున్నారు.

ఆదర్శ పాఠశాలలో యాన్యువల్ డే



నవతెలంగాణ-సదాశివనగర్

తెలంగాణ ఆదర్శ పాఠశాల సదాశివనగర్ యందు నిర్వహించిన యాన్యువల్ డే ప్రోగ్రాంను బుధవారం నిర్వహించారు. ఈ యాన్యువల్ డేకు శ్రీనివాసచారి అడిషనల్ డైరెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు మంచిగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. ప్రభుత్వం ప్రతి విద్యార్థికి లక్ష రూపాయలు ఖర్చు చేస్తూ అన్ని రకాల సౌకర్యాలను కల్పిస్తుందని వాటిని విద్యార్థులు సద్వినియోగించుకోవాలని, భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని ఆకాంక్షించారు. అలాగే ఉపాధ్యాయులు విద్యార్థులకు చక్కని విద్య అందించి విద్యార్థుల ప్రగతికి పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో దుర్గాప్రసాద్ కామారెడ్డి డీఈవో ఎస్.రాజు, మండల ఎంఈఓ జోసెఫ్ ఏఎస్ఓ సుధాకర్, జెడ్‌పిహెచ్ఎస్ హెచ్ఎం దామోదర్ రెడ్డి, పాఠశాల ప్రిన్సిపల్ కె.రాజారెడ్డి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు, విద్యార్థులు పాల్గొన్నారు.

గూడు కల్పించండి అంటు వినతి

• బాధితులను ఆదుకుంటామన్న తహసిల్దార్



నవతెలంగాణ-బీర్కూర్ (నసరుల్లాబాద్)

విద్యుద్ఘాతంతో సర్వస్వం కోల్పోయామని తమకు ప్రభుత్వపరంగా ఆదుకోవాలని ఉండటానికి గూడు కల్పించాలంటూ బాధితులు స్థానిక తహసిల్దార్‌కు బుధవారం వినతి పత్రం అందజేశారు. బీర్కూర్ మండల కేంద్రంలో ఈనెల 27న మూడు పెంకుటిల్లు దగ్ధమై పది లక్షల రూపాయల ఆస్తి నష్టం వాటిల్లింది. బీర్కూర్ గ్రామానికి చెందిన పిడుగు గంగమని, పిడుగు సాయవ్వ, పిడుగు శాంతవ్వ నివాసపు ఇల్లు కాలిపోయి సర్వస్వం కోల్పోయి రోడ్డున పడ్డారు. ఉండడానికి ఇల్లు లేక, తినడానికి తిండి లేక పస్తులు ఉంటున్నామన్నారు. దీనితో బీర్కూర్ తహసీల్దార్ లతను కలిసి తమకు పోలీస్ స్టేషన్ ఎదురుగా రెండేళ్ల క్రితం నిర్మించిన రెండు పడక గదుల్లో గదులు కేటాయించాలని వినతి పత్రం అందజేశారు. తాము ఉండడానికి నీడ లేదని తమకు ఉండడానికి గూడు కల్పించాలంటూ అగ్ని బాధితులు తహసీల్దార్ లతకు విజ్ఞప్తి చేశారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి న్యాయం చేస్తానని తహసీల్దార్ బాధితులకు భరోసా కల్పించారు.

వజ్రోత్సవ వేడుకులకు సిద్ధమైన పాఠశాల

నవతెలంగాణ-సదాశివనగర్



మండలంలోని కల్వరాల్ గ్రామంలోని జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో వజ్రోత్సవ వేడుకలకు సిద్ధం చేశారు. ఈ పాఠశాలలో 1965 నుంచి 2025 వరకు ఈ పాఠశాలలో చదివిన వారు ఈ ఉత్సవాలు నిర్వహిసున్నట్టు ప్రధానోపాధ్యాయులు విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. 1987-88 సంవత్సరంలో కలవరాలు పాఠశాలలో పదవ తరగతి ఏర్పాటు చేసినట్టు సూచించారు. అప్పటి నుంచి ఈ పాఠశాలలో 37 బ్యాచులు పదో తరగతి చదువుకున్నట్టు ఆయన తెలిపారు. ఈ పాఠశాల కార్పొరేట్ విద్యకు ధీటుగా విద్యాబోధన జరగాలని అందరూ కృతనిచ్చయంతో ముందుకు వచ్చి చందాలు ఇచ్చినట్టు పేర్కొన్నారు. పాఠశాల అభివృద్ధిలో జిల్లాకే ఆదర్శంగా అభివృద్ధి చెందాలని కోరుకుంటున్నట్టు తెలిపారు. ఈనెల 7న వజ్రోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ప్రతి ఒక్కరు ఈ వేడుకల్లో పాల్గొనాలని ప్రధాన ఉపాధ్యాయులు హర్షవర్ధన్‌రెడ్డి, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుజాత, గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు కుంట రాజిరెడ్డి, కుంట గంగారెడ్డి తెలిపారు.

తడి పొడి చెత్త పరిశీలన

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని పద్మాజివాడి గ్రామంలో తాడి పొడి చెత్తను డిఎల్‌పిఓ శ్రీనివాస్ బుధవారం పరిశీలించారు. గ్రామంలోని శానిటేషన్‌ని పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీఓ సురేందర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి ప్రశాంత్, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రం ప్రారంభించిన్న పిఎసిఎస్ వైస్ చైర్మన్

నవతెలంగాణ-రాజంపేట్

రాజంపేట మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో పిఎసిఎస్ వైస్ చైర్మన్ ఆముదాల రమేష్ తన సొంత ఖర్చుతో చలివేంద్రాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..

ఎండా కాలాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రజల దాహాన్ని తీర్చడానికి ప్రారంభిస్తున్నట్టు తెలిపారు.

సిపిఎస్ రద్దు చేసి ఓపిఎస్‌ను పునరుద్ధించాలి

• టిటియు ఉపాధ్యాయ సంఘం డిమాండ్



మాట్లాడుతున్న టిటియు ఉపాధ్యాయ సంఘం నాయకులు

నవతెలంగాణ-జుక్కల్

సిపిఎస్ రద్దు చేసి, ఓపిఎస్ పునరుద్ధించాలని జిల్లా (టిటియూ) తెలంగాణ టీచర్స్ యూనియన్ అధ్యక్షులు ముజుబుద్దీన్, కార్యదర్శి కాంబ్లే గోపాల్ డిమాండ్ చేశారు. మండలంలోని మహ్మదాబాద్ ఎంపీపీఎస్ పాఠశాల ఆవరణలో బుధవారం మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు ముజుబుద్దీన్, కార్యదర్శి. కాంబ్లే గోపాల్ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం సిపిఎస్‌లు వెంటనే రద్దు చేయాలని, ఓపీఎస్‌ను పునరుద్ధించాలని పేర్కొన్నారు. నూతన డిఆర్సి ప్రకటించాలని, ఐదు డిఏలు ఇవ్వాలని, పాత బకాయిలు చెల్లించాలని, ఆదర్శ పాఠశాలలు చేసిన కమిటీల పనులకు బిల్లులు వెంటనే చెల్లించాలని ప్రకటనలో కోరారు. కార్యక్రమంలో జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.శ్రీనివాసులు, కోశాధికారి ఆర్. రఘు, మండల అధ్యక్షులు కాంబ్లే సాయిలు, ఉపాధ్యాయ బృందం, తదితరులు పాల్గొన్నారు.

సాగునీరు అందని పంటలు పరిశీలన


పంటలను పరిశీలిస్తున్న అధికారులు

నవతెలంగాణ-బోధన్

సాలూర మండలం జాడి జామాల్పూర్ గ్రామం శివారులో నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి విడుదలయ్యే సాగునీరు అందని మొక్కజొన్న, వరి పంట పొలాలను బుధవారం సాలూర మండల వ్యవసాయ శాఖ అధికారి శ్వేత, ఇరిగేషన్ ఏఈ శృతి, ఏఈఓ ఉమా పరిశీలించారు. నిజాంసాగర్ నీళ్లు అందని ఎండుతున్న పంట పొలాలకు సాగునీరు అందేలా చర్యలు చేపడతామని వారు రైతులకు భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో బోధన్ మండల వ్యవసాయ అధికారి ఎండి అలీమ్ , గ్రామస్తులు దేవదానయ్య ఆలూరి రామకృష్ణ ,నేపాల్ చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

హక్కులకోసం రైతులు పోరాడాలి

- ఏఐకేఎస్


మాట్లాడుతున్న ఏఐకేఎస్ నాయకులు

నవతెలంగాణ-నవీపేట్

తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో మండలంలోని అభంగపట్నం గ్రామంలో జిల్లా ఉపాధ్యక్షులు దేవేందర్ సింగ్ బుధవారం సభ్యత్వ నమోదును చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నాయని అన్నారు. కాబట్టి రైతులంతా ఏకమై తమ హక్కులను కాపాడుకోవడం కోసం పోరాటాలు చేయాలని అన్నారు. అనంతరం రైతు సంఘంలో ఎక్కువమంది రైతులు సభ్యత్వం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల సహాయ కార్యదర్శి మంత గంగాధర్ పాల్గొన్నారు.

వేసవి తీవ్రతపై ప్రజలను అప్రమత్తం చేయాలి

- అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

వేసవిలో ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ అధికారులకు సూచించారు. ఎండల తీవ్రత, చేపట్టాల్సిన జాగ్రత్త చర్యలపై బుధవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ నేతృత్వంలో జిల్లా టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయా శాఖల అధికారులకు అదనపు కలెక్టర్ పలు సూచనలు చేశారు. ఈసారి వేసవి సీజన్లో సాధారణం కంటే ఎక్కువగా ఉష్ణోగ్రతలు ఉండే అవకాశం ఉందని వస్తున్న హెచ్చరికలను దృష్టిలో పెట్టుకుని ముందస్తుగానే ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. వేసవిలో కార్మికులు, ప్రజలు భారీ ఉష్ణోగ్రతల వల్ల వడగాడ్పులకు లోనై ఇబ్బందులు పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. లేబర్ అడ్డాలు, పని ప్రదేశాలను గుర్తించి తాగునీరు అందుబాటులో ఉంచాలని, అన్ని బస్తీ, పీ.హెచ్.సీ, సీ.హెచ్.సీలలో రెట్టింపు స్థాయిలో ఓఆర్ఎస్ ప్యాకెట్లను నిల్వ ఉండేలా చూడాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. వైద్య ఆరోగ్య, ఉపాధి హామీ, పర్యావరణ, పంచాయతీరాజ్, కార్మిక తదితర శాఖలు వడదెబ్బ నివారణపై కార్యచరణ ప్రణాళిక రూపొందించాలని సూచించారు. ప్రతి ఆరోగ్య కేంద్రం, అంగన్వాడీ సెంటర్లలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని, కేంద్రాలకు వచ్చే వారికి ఓఆర్ఎస్ ద్రావణం అందించాలని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వసతి గృహాల్లో ఎండ తీవ్రత పై అవగాహన కల్పించాలని, ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందించాలని సూచించారు. ఎండలు తీవ్రంగా ఉన్న సమయంలో ప్రజలు ఇళ్ల నుండి బయటకు రాకుండా చూడాలని, ఒకవేళ అత్యవసరం అయితే తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సాధారణానికి మించి వేసవి ఉష్ణోగ్రతలు ఉన్న సమయాలలో ఏమి చేయాలో ఏమి చేయకూడదనే అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఆరోగ్య సిబ్బంది ఎప్పటికప్పుడు ప్రజలకు అవసరమైన సలహాలు, సూచనలు ఇవ్వాలని అన్నారు. ప్రధానంగా వ్యవసాయ కూలీలు, ఉపాధి హామీ కూలీలు, వివిధ పరిశ్రమలలో పని చేసే వారు, భవన నిర్మాణ రంగ కార్మికులు తదితరులు ఎండలో పని చేయాల్సి రావడం వల్ల ఎక్కువగా వడదెబ్బ బారిన పడే ప్రమాదం ఉన్నందున అలాంటి వారందరికీ తగు సదుపాయాలు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. వడదెబ్బ నివారణ కోసం పాటించాల్సిన పద్ధతులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేస్తూ కరపత్రాల ద్వారా ప్రజల్లో అవగాహన పెంపొందింపజేయాలని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ రాజశ్రీ ను ఆదేశించారు. ఉపాధి హామీ కూలీలకు వారు పని చేసే ప్రదేశాల్లో నీడను అందించేందుకు టెంట్లు ఏర్పాటు చేయాలని, కూలీలు తప్పనిసరిగా తమ వెంట తాగునీటిని తెచ్చుకునేలా చూడాలని సూచించారు. జిల్లాలో ఎక్కడ కూడా వడదెబ్బతో ప్రజలు ఇబ్బందులు, అనారోగ్యాల బారిన పడకుండా అధికారులు అంకిత భావంతో కృషి చేయాలని హితవు పలికారు. ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్

పసుపు బాలాజీ మందిరంలో ప్రత్యేక పూజలు



నవతెలంగాణ-(వేల్పూర్) ఆర్మూర్

మండలంలోని కుకునూర్ గ్రామంలో బుధవారం పసుపు బాలాజీ మందిరం లో డిసిసిబి చైర్మన్ కుంట రమేష్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్, మాజీ వైస్ ఎంపీపీ, కుకునూర్ గ్రామ కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు, స్థానికులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ


భూమిపూజ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

నవతెలంగాణ-ముప్కాల్

మండలంలోని వేంపల్లి గ్రామంలో బుధవారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంకు భూమిపూజ చేసిన గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, పీఏసీఎస్ చైర్మన్ జక్క రాజేశ్వర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం బడుగుబాలహీన వర్గాల వారికి మేలు చేస్తుందని అన్నారు. లబ్ధిదారులు సీఎం రేవంత్ రెడ్డికి, నియోజకవర్గ ఇంఛార్జి ముత్యాల సునీల్ కుమార్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గంగారాం, మాజీ ఉప సర్పంచ్ ఎట్టెం మహేష్, డీసీసీ డెలిగేట్ ఉపాధ్యక్షులు రాజ్ కుమార్, యూత్ అధ్యక్షులు ధనుష్ యాదవ్, కాంగ్రెస్ నాయకులు లింగన్న, అశోక్, రాజేశ్వర్, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, యువకులు పాల్గొన్నారు.

శివ నంది అవార్డు గ్రహీత మనుశ్రీ

- గంగా విద్యానికేతన్ పాఠశాల విద్యార్థిని




విద్యార్థిని సన్మానిస్తున్న గంగా విద్యానికేతన్ పాఠశాల బృందం

నవతెలంగాణ-భీంగల్ రూరల్

హైదరాబాదులోని బిర్లా ఆడిటోరియంలో ఇటీవల జరిగిన నంది అవార్డు 2025 కార్యక్రమంలో చక్కటి ప్రతిభ కనబరిచిన భీంగల్ పట్టణానికి చెందిన గంగా విద్యానికేతన్ పాఠశాలలో మూడవ తరగతి చదువుతున్న విద్యార్థిని పి, మనుశ్రీ చక్కటి కూచిపూడి, కథక్, ఆంధ్రనాట్యం కలిపి శివమ్ అనే పాటపై తన అద్భుతమైన ప్రదర్శన ఇచ్చి శివ నంది అవార్డును దక్కించుకుందన్నారు. ఈ నాట్య పోటీల్లో వారి పాఠశాల విద్యార్థిని అవార్డు గెలుచుకున్నందుకు కరస్పాండెంట్ రాజ్ కుమార్ శుభాకాంక్షలు తెలిపి చాలా సంతోషంగా ఉందని ఆనందం వ్యక్తం చేశారు. కలాకర్ తెలుగు టీవీ ఉత్సవాల్లో భీంగల్ పట్టణ కేంద్రానికి చెందిన మను శ్రీ శివ నంది అవార్డు దక్కించుకున్నందుకు తనకి భీంగల్ కు చెందిన న్యూ ఫ్రెండ్స్ యూత్ ఘన సన్మానం చేశారు.

సత్యనారాయణ గుప్తా సేవలు మరువలేనివి

- మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్


బాధిత కుటుంబన్ని సరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే

నవతెలంగాణ-డిచ్‌పల్లి

బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాధవనగర్ సాయిబాబా ఆలయ కమిటీ మాజీ చైర్మన్ కొత్త సత్యనారాయణ గుప్త ఇటీవలే అనారోగ్యంతో మృతి చెందారు. బుధవారం మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్దన్ డిచ్ పల్లి మండల కేంద్రంలోని సత్యనారాయణ గుప్త కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. సాయిబాబా ఆలయ కమిటీ చైర్మన్గా ఉన్నప్పుడు సత్యనారాయణ చేసిన సేవలు మరువలేనివని, ఆయన మృతి బాధాకరమని కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని సూచించారు. ఆయన వెంట మాజీ జెడ్పీటీసీ బాజిరెడ్డి జగన్, ఇందల్ వాయి మాజీ ఎంపీపీ బాధవత్ రమేష్ నాయక్, బిఆర్ఎస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు శక్కరి కోండ కృష్ణ, నాయకులు గోపు చిన్నన్న, నీరడి పద్మారావు, నల్లవెల్లి సాయిలు, ఒడ్డెం నర్సయ్య, గుడాల లింగం, దాసరి, లక్ష్మీనర్సయ్య, తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

పెరిగిన కరువు భత్యం

ఏప్రిల్ 1వ తేదీ నుండి చెల్లించాలి

- బిఎల్ టీయూ రాష్ట్ర అధ్యక్షులు యస్, సిద్ధిరాములు

నవతెలంగాణ-కంఠేశ్వర్

బీడీ కార్మికులకు వెయ్యి బీడీ లకు పెరిగిన కరువు భత్యం (వీడీఏ) 10-40 పైసలు, వెయ్యి బీడీలకు అన్ని కలుపుకుని 261-97 పైసలు ఈ పెరిగిన కరువు భత్యం ఏప్రిల్ 1 నుండి బీడీ యాజ మాన్యాలు, కార్మికులకు చెల్లించాల్సి ఉంటుందని తెలంగాణ బహుళ జన బీడీ కార్మిక సంఘం (బిఎల్ టీయూ) రాష్ట్ర అధ్యక్షులు యస్, సిద్ధిరాములు తెలిపారు. బుధవారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలో శివాజీ నగర్‌లో ఉన్న తెలంగాణ బహుళ జన బీడీ కార్మిక సంఘం బిఎల్ టీయూ రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షులు యస్. సిద్ధిరాములు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. కరువు భత్యం వీడిఎ అగ్రిమెంట్ ప్రకారం బీడీ కార్మికులకు నిత్య అవసరాలకు ధరల పెరుగుదలకు అనుగుణంగా ప్రభుత్వం కరువు భత్యం పెంచుతుందన్నారు. 2024 జనవరి నుండి డిసెంబర్ 2024 వరకు వినమయ ధరల పెరుగుదల అనుగుణం గా 1809 పాయింట్ల నుండి 1913 పాయింట్ల పెరిగిందని, 104 పాయింట్లు పెరిగిందని, పాయింట్‌కు పది పైసలు చొప్పున కరువు బత్యం వీడిఏ రూ,10-40,పైసలు పెరిగిందిదన్నారు. ఈ పెరుగుదల ప్రకారం వెయ్యి బీడీలకు అన్ని కలుపుకుంటే వెయ్యి బీడీ లకు మొత్తం, 261-97 పైసలు చెల్లించాలన్నారు. ఈ అగ్రిమెంట్ ప్రకారం బీడీ ప్యాకర్లకు, నెలసరి ఉద్యోగులకు, రోజు 10-40 పైసలు నెల ఒక్కంటికి 312 రూపాయలు పెరిగిందన్నారు. ఈ పెరిగిన కరువు భత్యం వీడిఏ ను తెలంగాణ రాష్ట్రంలోని బీడీ యాజమాన్యం బీడీ కార్మికులకు ఏప్రిల్ ఒకటి 2025 చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. సమావేశం లో బిఎల్ టీయూ నిజామాబాదు జిల్లా నాయకులు, గోవింద్, రాజా మణి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని ఇస్సన్నపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త సిద్ధం భైరయ్య అనారోగ్యంతో మృతి చెందగా బుధవారం బాధిత కుటుంబాన్ని జిల్లా పరిషత్ మాజీ ఫ్లోర్ లీడర్ నా రెడ్డి మోహన్‌రెడ్డి పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని తెలిపారు. బాధిత కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నారని తెలుసుకొని నా రెడ్డి స్వచ్ఛంద సంస్థ ద్వారా రూ.2000, 50 కేజీల బియ్యాన్ని అందజేశారు. పిల్లల విద్యాభ్యాసాన్ని నా రెడ్డి స్వచ్ఛంద సంస్థ ద్వారా పూర్తి బాధ్యత తీసుకుంటామని కుటుంబానికి భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు, పాల్గొన్నారు.

దొంగతనం కేసుల్లో ఒకరు అరెస్టు

నవతెలంగాణ-ఆర్మూర్

దొంగతనాల కేసుల్లో నిందితుడు ఆలకుంట శ్రీనివాస్‌ను పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద బుధవారం అరెస్టు చేసి జైలుకు పంపినట్టు స్టేషన్ హౌస్ ఆఫీసర్ సత్యనారాయణ బుధవారం తెలిపారు. దేగాం, మిర్దాపల్లి గ్రామాల్లో అర్ధరాత్రి వేళ తాళం వేసి ఉన్న ఇండ్లలో జరిగిన దొంగతనం కేసుల్లో నిందితుడు అని తెలిపారు. ఆయన వద్ద నుండి దొంగతనం చేసిన బంగారు, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకుని జైలుకు పంపామన్నారు.

పసుపు పరిశోధన స్థానాన్ని సందర్శించిన హింగోలి రైతులు


పసుపు పరిశోధనాకేంద్రానికి వచ్చిన హింగోలి రైతులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రం శివారులోని ఆచార్య కొండ లక్ష్మణ్ బాపూజీ పసుపు పరిశోధన స్థానాన్ని మహారాష్ట్రలోని హింగోలికి చెందిన ఆరుగురు సభ్యులతో కూడిన పసుపు రైతుల బృందం సభ్యులు బుధవారం సందర్శించారు. పసుపు రైతుల బృందం సభ్యులకు పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మహేందర్ పలు అంశాలపై వివరించారు. పరిశోధన స్థానంలో వివిధ నూతన పసుపు వంగడాల అభివృద్ధిపై కొనసాగుతున్న పరిశోధనలను, వంగడాల అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలను, నూతన పసుపు వ్యవసాయ పనిముట్ల తయారీపై హింగోలి పసుపు రైతులకు అవగాహన కల్పించారు. పరిశోధన స్థానంలో నిర్వహించే పరిశోధనలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ప్రసన్న కేంద్రాల్లో అభివృద్ధి చేసిన నూతన పసుపు వంగడాల ప్రత్యేకతను, నూతన వంగడాల ఆవశ్యకతను బృందం సభ్యులకు సవివరంగా అవగాహన కల్పించారు. పసుపు పరిశోధన కేంద్రం ఆధ్వర్యంలో అభివృద్ధి చేసిన పసుపు సాగు యంత్రాల వినియోగం, సాగులో వాటి ప్రాముఖ్యతను క్షేత్రస్థాయిలో శాస్త్రవేత్తలు పసుపు రైతు బృందం సభ్యులకు వివరించారు. ఈ సందర్భంగా పరిశోధన కేంద్రంలో నూతనంగా అభివృద్ధి చేసిన పసుపు పొంగడాలను బృందం సభ్యులు పరిశీలించి, రైతులకు నూతన వంగడాలతో కలిగే ప్రయోజనాలను అడిగి తెలుసుకున్నారు. పసుపు కుటీర పరిశ్రమగా అభివృద్ధి చెందే మార్గాలపై, ఇందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకోవాల్సిన చర్యలపై శాస్త్రవేత్తలతో రైతులు చర్చించారు. హింగోలి పసుపు రైతులు జిల్లాలో రెండు రోజులపాటు పర్యటించనున్నారు. పర్యటనలో భాగంగా వివిధ ప్రాంతాలను సందర్శించి జిల్లాలో పసుపు పంట సాగుపై, పసుపు విత్తన శుద్ధి, పాలీసింగ్, ఎగుమతులు తదితర అంశాలపై పసుపు రైతులను కలిసి తెలుసుకొని ఉన్నారు. అదేవిధంగా హింగోలి పసుపు రైతుల బృందం సభ్యులు మార్కెట్ కమిటీలపై, మార్కెట్ కార్యాలయాలను సందర్శించి అవగాహన చేసుకుంటామని వారు తెలిపారు.

రెండు రోజులు ఫ్లెక్సీ షాపులు బంద్

నవతెలంగాణ-కామారెడ్డి

జిల్లా కేంద్రంలో రెండు రోజులు ఫ్లెక్సీ షాపులు బంద్ నిర్వహిస్తున్నట్టు ఫ్లెక్సీ షాప్ యజమానుల సంఘం ఆధ్వర్యంలో ఒక పత్రికా ప్రకటనలో తెలిపారు. ఫ్లెక్సీ కలర్స్ మెటీరియల్స్ కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ పరిధిలోకి తీసుకురావడానికి నిరసిస్తూ, నూతన ధరలను పెంచడం పట్ల ఆవేదన వ్యక్తం చేశారని పేర్కొన్నారు. ఈనెల 8,9 రోజులు ఫ్లెక్సీ షాపులు బంద్ నిర్వహిస్తున్నట్టు యజమానులు తెలిపారు.

రవన్న వర్ధంతి సభ పోస్టర్ల ఆవిష్కరణ

నవతెలంగాణ-ఆర్మూర్

సిపిఐ(ఎంఎల్) ప్రజాపంథా సిద్ధాంతకర్త కామ్రేడ్ రాయల సుభాష్ చంద్రబోస్ రావన్న 09 వ వర్ధంతి సభ పోస్టర్లను బుధవారం పట్టణంలోని కుమార్ నారాయణ్ భవన్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిపిఐఎంఎల్ మాస్‌లైన్ (ప్రజాపంథా) డివిజన్ కార్యదర్శి బి. దేవారం జిల్లా నాయకులు ఎం.ముత్తెన్న.. మాట్లాడుతూ భారత విప్లవ ఉద్యమంలో 50 సంవత్సరాలు అజ్ఞాత జీవితం గడిపి అనేక ప్రజా ఉద్యమాలను నిర్మించిన ఘనత కామ్రేడ్ రాయల సుభాష్ చంద్రబోస్ (రవన్న)కు ఉందన్నారు. గోదావరి లోయ పరిహాక ప్రాంతంలో లక్షలాది ఎకరాల పోడు భూములను గిరిజనులు గిరిజనేతర పేద ప్రజలకు సాధించడంలో రవన్న పాత్ర క్రియాశీలకమైందని వారన్నారు. అలాగే ఏజెన్సీ ప్రాంతంలో కరెంటు, రహదారి , విద్య, వైద్యం అభివృద్ధి చెందాలని అనేక ప్రజా పోరాటాలు నిర్వహించడంలో కామ్రేడ్ రవన్న చూపిన మార్గదర్శకం పార్టీకి అమోఘంగా ఉందని వార న్నారు. భారతదేశంలో విప్లవం విజయవంతం కావాలంటే మారిన పరిస్థితికి అనుగుణంగా పార్టీ కార్యక్రమం, పందా, నిబంధవాలిని మార్చుకోవాలని సిద్ధాంతికరించిన గొప్ప నాయకుడని వారు కొని ఆడారు. భారతదేశంలో పెట్టుబడిదారీ వ్యవస్థకు వ్యతిరేకంగా వర్గ పోరాటాలను చేయా లని వారు ఆశించారని, దాని ద్వారానే విప్లవం విజయవంతం అవుతు ందని నమ్మిన సిద్ధాంతకర్త అని అన్నారు. కామ్రేడ్ రవన్న 09వ వర్ధంతి స భను ఖమ్మం రామ నర్సయ్య విజ్ఞాన కేంద్ర ంలో మార్చ్ 09న సభను నిర్వహి స్తున్నామని ఈ వర్ధంతి సభకు ప్రజలు అత్యధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని వారు ఈ సందర్భంగా పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ డివిజన్ సహాయ కార్యదర్శి రమేష్, సబ్ డివిజన్ కార్యదర్శి బి.కిషన్, డివిజన్ నాయకురాలు సత్తెక్క, సబ్ డివిజన్ నాయకులు టి.గంగాధర్ యు.రాజన్న, జి.పద్మ ప్రజసంఘాల నాయకులు రవి, నిఖిల్, సిద్ధు, నవదీప్, సాయిరాజ్, అఖిల్ పాల్గొన్నారు.

మలిదశ తెలంగాణ ఉద్యమకారుడు మృతి

నవతెలంగాణ-వర్ని

మలిదశ తెలంగాణా ఉద్యమ కారుడు వర్ని (వడ్డేపల్లి) కృష్ణగౌడ్ 38 అకాల మరణం బీఆర్ఎస్ పార్టీకి తీరని లోటు అయింది. ఆనాడు తనతో తెలంగాణ కోసం ఉద్యమం చేసిన ఉద్యమకారులు బుధవారం అంత్యక్రియలో పాల్గొన్నారు. కృష్ణ గౌడ్ మృత దేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అంత్యక్రియల్లో బీఆర్ఎస్ పార్టీ బాన్సువాడ మునిసిపల్ వైస్ చైర్మన్ జుబేర్, జలాల్పూర్ శ్రీనివాస్ ఆనంద్, శివ సూరి, రమేష్, సంజయ్, బీఆర్ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ ఎజాజ్ తదితరులు పాల్గొన్నారు.

57 ఎకరాల సిఎస్ఐ భూములను విక్రయించారు..

- సీఎస్ఐటిఏ ఉపాధ్యక్షులు గుండ్ర కృపానందం



మాట్లాడుతున్న సీఎస్ఐటిఏ ఉపాధ్యక్షులు

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలో సిఎస్ఐకి చెందిన 57 ఎకరాల భూములను చర్చి ఆఫ్ సౌత్ ఇండియా అనుమతి లేకుండా విక్రయించారని, సొంత ప్రయోజనాల కోసం భూములు అమ్ముతున్నారని, సిఎస్ఐటిఏ ఉపాధ్యక్షులు గుండ్ర కృపానందం, లీగల్ బోర్డ్ కన్వీనర్ అనిల్ కుమార్ లు అన్నారు. పట్టణంలోని ప్రెస్ క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జిల్లాలోని డిచ్ పల్లిలోని క్రిస్టియన్ మెడికల్ కాలేజ్ స్థలంతో పాటు భవనాన్ని చర్చ్ ఆఫ్ సౌత్ ఇండియా ట్రస్ట్ అసోసియేషన్ అనుమతి లేకుండానే ఆరుగురు వ్యక్తులు లీజుకు ఇచ్చిన విషయమై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు వారు తెలిపారు. డిచ్ పల్లిలో క్రిస్టియన్ మిషనరీ ఆధ్వర్యంలో గతంలో ఆసుపత్రిని ఏర్పాటు చేశారన్నారు. దీనికి అనుబంధంగా విక్టోరియా మెడికల్ కళాశాల భవనాన్ని నిర్మించారని వివరించారు. సర్వే నంబర్ 425/1 నుంచి 496/2లోని స్థలంతో పాటు భవనాన్ని చర్చ్ ఆఫ్ సౌత్ ఇండియా చెన్నై అనుమతి లేకుండానే ఆరుగురు వ్యక్తులు లీజుకు ఇచ్చారన్నారు. ఈ స్థలం, భవనం సిఎస్ఐ ట్రస్టుకు సంబంధించింది కాబట్టి లీజుకు ఇవ్వడం కుదరదన్నారు. లీజు చెల్లదనే విషయాన్ని జిల్లా రిజిస్ట్రార్ సైతం ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. ఈ లీజును రద్దు చేయాలని కోరినట్లు తెలిపారు. పట్టణంలో సిఎస్ఐ చర్చి పరిధిలో గతంలో 63 ఎకరాల స్థలం ఉండగా ప్రస్తుతం కేవలం 6 ఎకరాల స్థలం మిగిలి ఉందన్నారు. మిగిలిన 57 ఎకరాల స్థలాన్ని కొందరు సొంత ప్రయోజనాల కోసం అమ్మి వేశారని ఆరోపించారు. కోట్ల రూపాయల విలువ గల స్థలాన్ని చర్చి ఆఫ్ సౌత్ ఇండియా ట్రస్ట్ అసోసియేషన్ కంపెనీ డైరెక్టర్ల అనుమతి లేకుండా ఏవిధంగా విక్రయించారని వారు ప్రశ్నించారు. సిఎస్ఐ భూములను ఎవరు విక్రయించడానికి, లీజు ఇవ్వడానికి అధికారం లేదన్నారు. బిషప్స్, చర్చి ఫాదర్స్‌కు సైతం ఎలాంటి అధికారం లేదని స్పష్టం చేశారు. సిఎస్ఐ విలువైన భూములను కాపాడడానికి లే కార్యదర్శి ఉంటారే తప్ప అమ్మడానికి కాదన్నారు. ఈమధ్య పట్టణ కమిటీ సభ్యుడు రేపల్లె బాబీ ప్రసాద్ భూములు, డబ్బుల విషయంపై ప్రశ్నిస్తే చర్చికి రావద్దని పాస్టర్ చెప్పడానికి వీలు లేదన్నారు. పట్టణంలో సమాధుల స్థలాన్ని, పాఠశాల స్థలాన్ని అమ్మడానికి ప్రయత్ని స్తున్నారని వారు ఆరోపించారు. ప్రస్తుతం చెన్నైలో ఎలాంటి ట్రస్టు లేదు కాబట్టి వీటి భూములను కాపాడడానికి తాము ప్రయత్నిస్తున్నామని చెప్పారు. చర్చిలోని పాస్టర్స్, ఉపాధ్యాయులు వేతనాలు తీసుకుంటూ పనిచేసేవారని చెప్పారు. వీరు చర్చి పోషకులు, యజమానులపై అజమాయిషి చేస్తున్నారని చెప్పారు. చర్చిలోని సభ్యులను సస్పెండ్ చేయడం, బహిష్కరించడం చెల్లదన్నారు. బీసీ(సీ)లో ఉన్న క్రైస్తవులు మాత్రమే చర్చి కమిటీలలో సభ్యులుగా ఉండవచ్చని, మిగతావారు సభ్యులుగా ఉండరాదన్నారు. అయితే ఆర్మూర్ చర్చి కమిటీలో బీసీ(సీ) కానీ క్రైస్తవులు సైతం కమిటీ సభ్యులుగా ఉన్నట్లు తెలిసిందన్నారు. డిచ్‌పల్లి, ఆర్మూర్‌తోపాటు కొన్ని జిల్లాల్లో సిఎస్ఐటిఏకు ఎలాంటి సమాచారం లేకుండా, డైరెక్టర్ల తీర్మానాలు లేకుండా భూముల లీజు, విక్రయాలు చేసిన వాటిపై న్యాయస్థానం ద్వారా పోరాటం చేస్తామని వారు చెప్పారు. సమావేశంలో సిఎస్ఐ టి ఏ అధ్యక్షులు వీసి రవిచంద్రన్, పట్టణ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడు రాపల్లి బాబీ ప్రసాద్, కన్వీనర్లు దేవిడ్ రాజ్, పాల్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

నల్లాలకు మోటార్లు పెడితే చర్యలు


మాట్లాడుతున్న ఎంపీడీవో గంగుల సంతోష్ కుమార్

నవతెలంగాణ-భీంగల్ రూరల్

గ్రామాల్లో తాగునీటి ఇబ్బంది తలెత్తకుండా తగు చర్యలు తీసుకోవాలని, నల్లాలకు మోటర్లు బిగిస్తే చర్యలు తీసుకుంటామని ఎంపిడిఓ గంగుల సంతోష్ కుమార్ అన్నారు. భీంగల్ మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, కారోబార్‌లతో తాగునీటి సరఫరా, ఇందిరమ్మ ఇళ్లు, ట్యాక్స్ కలెక్షన్స ఇతర అంశాలపై సమీక్షా సమావేశం బుధవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపిడిఓ సంతోష్ కుమార్ మాట్లాడుతూ గ్రామాల్లో తాగు నీటి సరఫరాలో ఎలాంటి అలసత్వం వహించవద్దని, మిషన్ భగీరథ నీరు, గ్రామంలో అందుబాటులో గల నీటి వనరులతో ప్రజలకు తాగునీరు అందించాలని కోరారు. నల్లాకు మోటర్ బిగించిన వారిపై తగు చర్యలు తీసుకోవాలని, నల్లా లకు ఆన్, ఆఫ్ సిస్టం పెట్టాలని సూచించారు.ఇంటి పన్నులు వేగవంతం చేయాలని ఇంటి పన్ను చెల్లించని వారికి నోటీసులు జారీ చేయాలని కోరారు.ఈ సమావేశంలో ఎంపిడిఓ గంగుల సంతోష్ కుమార్, డిఇఇ ధర్మేందర్, ఎంపీవో జావేద్, ఏఇ ఇంట్రా అమూల్య, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ టీ ప్రైడ్, టీ పాస్ పెట్టుబడి రాయితీలను సద్వినియోగించుకోవాలి

- కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

నవతెలంగాణ-కామారెడ్డి

తెలంగాణ టీ ప్రైడ్, టీ పాస్ పెట్టుబడి రాయితీలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. మంగళవారం సాయంత్రం జిల్లా పెట్టుబడుల ఉన్నతీకరణ కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. జిల్లాలో ఇప్పటి వరకు టీజి ఐ- పాస్ క్రింద 1370 దరఖాస్తులు రాగా, పరిశీలించి 1327 దరఖాస్తులను ఆయా శాఖల ద్వారా పరిశీలించగా, 1128 దరఖాస్తులు పరిశీలించి ఆమోదం తెలిపినట్టు కలెక్టర్ తెలిపారు. టీ ప్రైడ్ పథకం క్రింద 12 మంది ఎస్సీ లబ్ధిదారులకు రూ.34,68,551 నలుగురు ఎస్టీ లకు రూ.11,59,319 పెట్టుబడి రాయితీ మంజూరు చేసినట్టు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ వి.లాలు నాయక్, ఎల్‌డిఎం రవికాంత్, జిల్లా ఎస్సీ సంక్షేమ అధికారిని రజిత, విద్యుత్ శాఖ ఎస్ఈ శ్రావణ్ కుమార్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణానికి స్థలం పరిశీలన

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని మోతే గ్రామ సమీపంలో ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణం కోసం ఎల్లారెడ్డి ఆర్డీవో మన్నె ప్రభాకర్ స్థలాన్ని బుధవారం పరిశీలించారు. మండలానికి ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి ఇంటిగ్రేటెడ్ పాఠశాలను మంజూరు చేయించారు. పాఠశాల మంజూరు కావడంతో పాఠశాల నిర్మాణం కొరకు విశాలమైనటువంటి స్థలం అవసరమున్న దృష్ట్యా మండలంలోని మోతే గ్రామ సమీపంలో స్థలం ఉండడంతో అక్కడే నిర్మాణం చేపట్టడానికి యంత్రాంగం సిద్ధమైంది. ఈ నేపథ్యంలో గ్రామ సమీపంలోని సర్వేనెంబర్ 164లో 250 ఎకరాల ప్రభుత్వ భూమి ఉండడంతో ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణానికి సానుకూలంగా ఉంటుందని విశాలమైనటువంటి ప్రదేశమని అధికారులు స్థలాన్ని పరిశీలించారు. ఆర్డీవో స్థలాన్ని పరిశీలించి ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణానికి 25 ఎకరాలు అవసరం ఉందన్నారు. స్థలాన్ని పరిశీలించి పాఠశాల నిర్మాణానికి అనుకూలంగా ఉంటుందని నివేదికను జిల్లా అధికారులకు అందిస్తామన్నారు. ఆయన వెంట తహసీల్దార్ నరేందర్, సర్వేర్ గోపి, తదితరులు ఉన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా

ముందస్తు చర్యలు చేపట్టాలి

- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు
- ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు మార్కవుట్‌లు చేయాలి
- ఆస్తి పన్ను, ఎల్ఆర్ఎస్ ఫీజు వసూళ్లలో వేగం పెంచాలి
- వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులకు దిశానిర్దేశం
- హాస్టళ్లలో కంప్లయింట్ బాక్సులను ఏర్పాటు చేయాలని ఆదేశం

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

జిల్లాలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ బుధవారం తాగునీటి సరఫరా, ఆస్తి పన్ను, ప్లాట్ల క్రమబద్ధీకరణ (ఎల్ఆర్ఎస్) రుసుం వసూళ్ళు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు మార్కవుట్ చేయడం, రెసిడెన్షియల్ పాఠశాలలు, హాస్టళ్లలో కంప్లయింట్ బాక్సుల ఏర్పాటు, వాటి ద్వారా వచ్చే ఫిర్యాదులపై సత్వర చర్యలు చేపట్టడం తదితర అంశాలపై అదనపు కలెక్టర్ అంకిత్‌తో కలిసి సంబంధిత అధికారులతో సమీక్ష జరిపారు. వేసవి సీజన్‌ను దృష్టిలో పెట్టుకుని తాగునీటి సరఫరా వ్యవస్థను క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలన జరపాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలోని ఏ ఒక్క నివాస ప్రాంతంలోనూ నీటి ఎద్దడి రాకుండా ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తూ, అవసరమైన చోట యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టాలని ఆదేశించారు. ఆయా గ్రామాల వారీగా నీటి సరఫరా పరిస్థితిని నిరంతరం సమీక్షించాలని, చేతి పంపులు, బోరు బావులకు అవసరమైన చోట తక్షణమే మరమ్మతులు జరిపించాలని, రెండు రోజుల్లో అన్ని చోట్లా మరమ్మతు పనులు పూర్తి కావాలని గడువు విధించారు. స్థానికంగా ఉండే ఫ్లంబర్లు, బోరు మెకానిక్ లను గుర్తించాలని, మరమ్మతులు అవసరమైన సమయాలలో వారిని సంప్రదించి పనులు జరిపించాలన్నారు. మంచినీటి పథకాలకు విద్యుత్ సరఫరాలో అవాంతరాలు లేకుండా చూడాలని, పరీక్షల సీజన్ అయినందున హాస్టళ్లు, రెసిడెన్షియల్ స్కూళ్ళకు నీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. నివాస ప్రాంతాలతో పాటు అన్ని అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలు, రెసిడెన్షియల్ విద్యా సంస్థలకు సమృద్ధిగా శుద్ధి జలాలు సరఫరా అయ్యేలా చూడాలన్నారు. ప్రతి ఆవాసంలో ఒక్కో నివాస గృహం వారీగా శుద్ధి జలాలు అందేలా నీటి సరఫరా వ్యవస్థను చక్కదిద్దాలని, కుళాయిల బిగింపు ప్రక్రియను వెంటనే పూర్తి చేయించాలన్నారు. పల్లె, పట్టణం అనే తేడా లేకుండా అన్ని గ్రామ పంచాయతీలు, మున్సిపల్ పట్టణాలలో తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని, ఎక్కడైనా లోపాలను గుర్తిస్తే వెంటనే వాటిని సరిచేయాలన్నారు. వాటర్ ట్యాంకులను క్రమం తప్పకుండా శుభ్రం చేయించాలని, ఓపెన్ బావులను తప్పనిసరిగా క్లోరినేషన్ చేయించాలని ఆదేశించారు. కాగా, ఆస్తి పన్ను, ప్లాట్ల క్రమబద్ధీకరణ రుసుం వసూళ్లలో వేగం పెంచాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. నిర్ణీత గడువులోపు పాత బకాయిలు సహా వంద శాతం పన్ను వసూలయ్యేలా చొరవ చూపాలన్నారు. పన్ను వసూళ్లలో పూర్తిగా వెనుకంజలో ఉన్న గ్రామ పంచాయతీల కార్యదర్శులపై చర్యలు తీసుకోవాలని డీఎల్‌పీఓలను ఆదేశించారు. ఎల్ఆర్ఎస్ క్రమబద్ధీకరణ ఫీజును మార్చి నెలాఖరు లోపు చెల్లిస్తే 25 శాతం రిబేటు వర్తిస్తుందని తెలిపారు. ఈ విషయాన్ని ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారులకు వివరిస్తూ, రిబేట్ సదుపాయం సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి లబ్ధిదారులు నిర్మాణాలు చేపట్టేలా మార్కవుట్ ప్రక్రియను త్వరితగతిన చేపట్టి, నిర్దేశిత ఆన్లైన్ యాప్‌లో వివరాలు పొందుపర్చాలని సూచించారు. ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలలు, సంక్షేమ వసతి గృహాలలో ఫిర్యాదు పెట్టెలను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. వీటి ద్వారా వచ్చే ఫిర్యాదులను ప్రతి వారం పరిశీలిస్తూ, సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ లో జెడ్పి సీఈఓ సాయాగౌడ్, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, డీపీఓ శ్రీనివాస్, ట్రాన్స్కో ఎస్.ఈ రవీందర్, జిల్లా వ్యవసాయ అధికారి వాజిద్ హుస్సేన్, ఆర్.డబ్ల్యూ.ఎస్ ఎస్.ఈ రాజేంద్రకుమార్, ఈ.ఈలు రాకేష్, స్వప్న, మున్సిపల్ కమిషనర్లు, మండల స్పెషల్ ఆఫీసర్లు, ఎంపీడీఓలు, ఎంపీఓలు, మిషన్ భగీరథ ఏఈలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

అనుమానాస్పదంగా యువకుడు మృతి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఇందల్ వాయి పోలీస్ స్టేషన్ పరిధిలోని సంస్థాన్ సిర్నపల్లి గ్రామానికి చెందిన కొవ్వాజి రాకేష్ 28 పొలంలో పచ్చి గడ్డి కోసుకరావడానికి వెళ్లి పొలం గట్టుపై నుండి పొలంలో నే పడిపోయి అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు ఎస్‌హెచ్‌ఓ మనోజ్ కుమార్ తెలిపారు. గ్రామస్తులు, ఎస్‌హెచ్‌ఓ తెలిపిన వివరాల ప్రకారం.. రాకేష్ గత కొన్ని రోజుల క్రితం ఆంజనేయస్వామి మాల ధరించాడు. పశువుల కు మేత కోసం పచ్చి గడ్డి తీసుకురావడానికి వెళ్ళాడు. అంతలోనే గట్టుపై నుండి పొలంలో పడి మృతి చెందినట్లు వివరించారు. మృతుని బంధువులు ఇది ముమ్మాటికి అనుమానస్పదంగానే మృతి చెందాడని దీనిపై విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. పోలీసులు విచారణ జరుపుతామని హామీ ఇవ్వడంతో కుటుంబ సభ్యులు శాంతించారు. మృతుని తండ్రి ఫిర్యాదు మెరకు కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించినట్లు ఎస్‌హెచ్‌ఓ వివరించారు.

కత్తితో దాడి చేసిన వ్యక్తి అరెస్ట్

నవతెలంగాణ-కంఠేశ్వర్

నగరంలోని రెండవ పోలీస్ స్టేషన్ పరిధిలో తాగిన మత్తులో కత్తితో దాడి చేసిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు రెండవ పోలీస్ స్టేషన్ ఎస్ఐ యాసిర్ అరాఫత్ బుధవారం తెలిపారు. మంగళవారం సాయంత్రం గాజులపేట్ నిజామాబాద్‌లో తాగిన మత్తులో తన బంధువైన లింగంపల్లి మహేష్‌పై కత్తితో బోడిగం సంతోష్ దాడి చేయగా గాయపడిన వ్యక్తి భార్య లింగంపల్లి పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి బోడిగం సంతోష్ ని అరెస్టు మెజిస్ట్రేట్ ముందు బుధవారం హాజరు పరిచారు. కోర్టు 15 రోజుల జ్యూడిషియల్ కస్టడీ పంపించినట్లు తెలిపారు.

రాష్ట్రస్థాయి జిజ్ఞాసలో బిచ్కుంద డిగ్రీ విద్యార్థుల ప్రతిభ

నవతెలంగాణ-బిచ్కుంద

కమిషనరేట్ ఆఫ్ కాలేజ్ ఎడ్యుకేషన్ (సిసిఈ) హైదరాబాద్ వారు ప్రతి సంవత్సరం నిర్వహించే రాష్ట్రస్థాయి జిజ్ఞాస పోటీల్లో బిచ్కుంద మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు కత్రిభ కనభరిచారు. (అటానమస్) ఎకనామిక్స్ విభాగం నుంచి సోషియో ఎకానమీ కండిషన్ ఆఫ్ బీడీ వర్కర్స్ అనే అంశం, చరిత్ర విభాగం వారి కౌలాస్ పోర్ట్ హిస్టారికల్ మార్వెల్ అనే అంశం ఎంపికై హైదరాబాదులోని ఇందిర ప్రియదర్శిని నాంపల్లి కళాశాలలో నేడు ప్రదర్శించారు. జాయింట్ డైరెక్టర్ ప్రొఫెసర్‌లు రాజేందర్ సింగ్, యాదగిరి చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందుకున్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అశోక్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గోశాలకు రూ.లక్ష చెక్కు అందజేత

నవతెలంగాణ-పిట్లం

సోమయప్ప స్వామీజీ గోశాల బిచ్కుంద నిర్వహణకు గాను మండల కేంద్రానికి చెందిన రిటైర్డ్ ప్రభుత్వ వైద్య అధికారి అచ్యుతం దంపతులు గోశాల నిర్వాహకులు నీతు శ్రీ, స్వప్న, గురు లింగం పంతులుకు రూ.లక్ష చెక్కును విరాళముగా బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా గోశాల నిర్వాహకులు నీతూ శ్రీ, స్వప్న మాట్లాడుతూ.. సోమాయప్ప గోశాల నిర్వహణలో 500 పైబడి ఆవులు ఉన్నాయని వాటి గడ్డి, నిర్వహణకు గాను రిటైర్డ్ ప్రభుత్వ వైద్య అధికారి అచ్యుతం దంపతులు విరాళం అందించినందుకు గోశాల నిర్వహణ తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ల్యాబ్ రమణగౌడ్ దంపతులు పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న రిటైర్డ్ వైద్యాధికారి

మీనాక్షి నటరాజను కలిసిన గీరెడ్డి మహేందర్ రెడ్డి



మీనాక్షి నటరాజ్‌తో మాట్లాడుతున్న మహేందర్‌రెడ్డి

నవతెలంగాణ-రామారెడ్డి

తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజను బుధవారం జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు గీరెడ్డి మహేందర్ రెడ్డి గాంధీభవన్లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా 40 సంవత్సరాల నుంచి పార్టీకి నిస్వార్థంగా సేవ చేస్తున్నామని, సరైన గుర్తింపు ఇవ్వాలని ఆమెకు వినతిపత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించినట్టు తెలిపారు.

డేట ఎంట్రీ ఆపరేటర్లకు కనీస వేతనం అమలు చేయాలి

నవతెలంగాణ-కామారెడ్డి

ఎన్‌హెచ్ఎం కాంటాక్ట్, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్, నేషనల్ హెల్త్ మిషన్‌లో పనిచేస్తున్న డేట ఎంట్రీ ఆపరేటర్లకు కనీస వేతనం అమలు చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.బాలరాజ్ అన్నారు. బుధవారం ఏఐటీయూసీ అనుబంధ సంఘం ఆధ్వర్యంలో 60వ జీవో అమలు చేయాలని కామారెడ్డి డీఎంహెచ్వో చంద్రశేఖర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో మెడికల్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు ఎల్ దశరథ్, అఖిల్, బాలు, సాగర్, ఉదయ్, సిద్దు, గీత, స్వాతి, దివ్య పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలి

- ఎంపీడీవో ప్రవీణ్ కుమార్

నవతెలంగాణ-దోమకొండ

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని సీతారాంపల్లి గ్రామంలో ఉపాధి హామీ పనులు, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను ఎంపీడీవో బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. ఉపాధి పనులు నిబంధన ప్రకారం చేపట్టాలని, ఉపాధి కూలీలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పనుల వద్ద జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గ్రామానికి చెందిన ఎర్రోళ్ల రాజయ్యకు మంజూరైన ఇందిరమ్మ ఇంటి నిర్మాణం పనులు ప్రారంభించి త్వరగా పూర్తిచేయాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, మాజీ సర్పంచ్ నాంపల్లి, గ్రామ నాయకులు సిద్ధ రాములు, అధికారులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సైన్స్ ఫెయిర్



సైన్స్‌ఫెయిర్‌ను తిలకిస్తున్న ఎంఈవో, విద్యాసంస్థల అధినేతలు

నవతెలంగాణ-బోధన్

సాలూర మండలం ప్రజ్ఞశ్రీ హైస్కూల్ లో బుధవారం సైన్స్ ఫెయిర్ లో భాగంగా విద్యార్థులు నిర్వహించిన సైన్స్ ప్రదర్శన అందరిని ఆకట్టుకుంది. ఒక్కో విద్యార్థి ఒక్కొక్క రకమైన ఆలోచనలో సరికొత్త అంశాలను తయారుచేసి ప్రదర్శించారు. ఈ సందర్భంగ ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంఈఓ రాజమంజూష మాట్లాడుతూ.. విద్యార్థులు నేటి ఆధునిక కాలానికి అనుగుణంగా టెక్నాలజీని అందిపుచ్చుకోవాలని సూచించారు. విద్యార్థులు ఎన్నో రకాల సాంకేతిక అంశాలను తయారుచేసి ప్రదర్శించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ప్రజ్ఞశ్రీ విద్యాసంస్థల అధినేత మిద్దెల రాజు, కరస్పాండెంట్ లత, విజేత విద్యాసంస్థల అధినేత రమణరెడ్డి, సీఆర్పీ స్వర్ణలత ఉపాధయులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలు ప్రశాంతం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

డిచ్ పల్లి మండలంలోని నాలుగు పరీక్ష కేంద్రాల్లో ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు బుదవారం ప్రశాంతంగా జరిగాయి. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 269 మంది విద్యార్థులకు గాను 267 మంది విద్యార్థులకు పరీక్షలకు హాజరు కాగా ఇద్దరు విద్యార్థులు పరీక్షలకు గైర్హజరైనట్లు ప్రిన్సిపాల్ చంద్ర విఠల్ తెలిపారు. ధర్మారం(బి) సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాల పరీక్ష కేంద్రంలో 287 మంది విద్యార్థులకు గాను 255 మంది పరీక్షలకు హాజరు కాగా 12 మంది విద్యార్థులకు పరీక్షలకు గైర్హజరయ్యారు. ప్రభుత్వ ఆదర్శ పాఠశాల పరీక్షా కేంద్రంలో 335 మంది విద్యార్థులకు గాను 379 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 16 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ప్రిన్సిపాల్ దశరథ్ తెలిపారు. మండల కేంద్రంలోని ఎస్బిఆర్ కళాశాల పరీక్ష కేంద్రంలో 212 మంది విద్యార్థులకు గాను 202 మంది హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ మంగమ్మ తెలిపారు 3 ముగ్గురు విద్యార్థులు గైర్హజరయ్యారు. పరీక్షా కేంద్రాలను అధికారులు తనిఖీలు చేశారు.

అక్రమ లేఔట్ ప్లాట్‌లో షెడ్ల కూల్చివేత

నవతెలంగాణ-కంఠేశ్వర్

నగరంలోని కంఠేశ్వర ప్రాంతంలో అనధికారికంగా నిర్మించిన షెడలను నిజామాబాద్ మున్సిపల్ అధికారులు బుధవారం జెసిబితో కూల్చివేశారు. కంఠేశ్వర్‌లోని 1998 లో 15వ నెంబర్ ఎల్పిలోని లేఅవుట్ ఓపెన్ స్పేస్‌లో అనధికారికంగా నిర్మించిన షెడ్లను కూల్చివేశారు. 219వ సైట్ లోని సైట్ నంబర్ 2 కూల్చివేసినట్లు అధికారులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖ అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గేట్‌వాల్ పైప్‌లైన్‌కు మరమ్మతులు

నవతెలంగాణ-తాడ్వాయి

మండలంలోని దేమీకలను గ్రామంలో గేట్‌వాల్ పైప్‌లైన్ మరమ్మతు పనులు చేయిస్తున్నట్టు పంచాయతీ కార్యదర్శి డి.అనిల్ తెలిపారు. బుధవారం ఉదయం గేట్‌వాల్, పైప్‌లైన్‌లు చెడిపోయాయని దీనితో గ్రామంలో తాగునీటి ఇబ్బందులు ఉండొద్దని, 50 మీటర్ల పైప్‌లైన్ సీసీ రోడ్డుపై డ్రిల్లింగ్ సహాయంతో మరమ్మతులు చేయించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కారోబార్ శ్రీను, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

శెట్టిపల్లిలో ఒకరి అదృశ్యం



నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని శెట్టిపల్లి గ్రామంలో ఒకరు అదృశ్యమైనట్టు లింగంపేట ఎస్సై వెంకట్రావు బుధవారం తెలిపారు. వారం రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లారని ఇప్పటివరకు ఆచూకీల అభ్యం కాలేదన్నారు. చుట్టుపక్కల బంధువుల వద్ద వెతికిన ఆచూకీలు తెలియలేదని, కుటుంబ సభ్యులు స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నామని ఎస్సై పేర్కొన్నారు.

పెద్దమ్మ ఆలయ అభివృద్ధికి కృషి చేస్తా

నవతెలంగాణ-దోమకొండ

నియోజవర్గంలోని ఆలయాల అభివృద్ధి కోసం తన వంతు కృషి చేస్తానని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో ముదిరాజ్ శ్రీ వనదుర్గ పెద్దమ్మతల్లి, ఆలయ ప్రాంగణంలో ప్రహరీగోడ, సీసీ రోడ్డు పనులను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజ వర్గంలోని ప్రజల అభివృద్ధి సంక్షేమానికి, ఆలయాల అభివృద్ధితో పాటు, కుల సంఘాల ఆర్థిక అభివృద్ధి సంక్షేమం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రతి ఒక్కరు సమాజ సేవతో పాటు, భగవంతుని సేవ కోసం కృషి చేయాలని, యువత దైవ మార్గంలో ముందుండాలని కోరారు. అనంతరం ముదిరాజ్ పెద్దమ్మ ఆలయ కమిటీ అధ్యక్షులు పున్న లక్ష్మణ్, ముదిరాజ్ సంఘం సభ్యుల ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో శ్రీ వనదుర్గ పెద్దమ్మ ఆలయ కమిటీ అధ్యక్షుడు పున్న లక్ష్మణ్, ఆలయ కమిటీ ఉపాధ్యక్షులు అబ్రబోయిన పెద్ద బాలయ్య, ప్రధాన కార్యదర్శి బోయిన్ సత్యం, కోశాధికారి నర్సింలు, ఆలయ కమిటీ డైరెక్టర్లులు, ముదిరాజ్ సంఘం సభ్యులు అబ్రబోయిన రాజేందర్, గాండ్ల రాములు, అబ్రబోయిన స్వామి, బిజెపి పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

మౌళిక సదుపాయాలు, పరికరాలు సిద్ధం చేయాలి : కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

నవతెలంగాణ-కామారెడ్డి

సదరం క్యాంపుల నిర్వహణకు కావలసిన మౌళిక సదుపాయాలు, అవసరమైన పరికరాలకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో వైద్య ఆరోగ్య శాఖ, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఇటీవల సంబంధిత అధికారులతో సేర్ప్ సి.ఈ.ఓ. నిర్వహించిన జూమ్ కాన్ఫరెన్స్‌లో సూచించిన ప్రకారంగా జిల్లాలో సదరం క్యాంపుల నిర్వహణకు కావలసిన పరికరాలు, మిషనరీ, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని తెలిపారు. ప్రతిపాదనలు వెంటనే సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డి.శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ ఫరీదా బేగం, జిల్లా ఆసుపత్రి కో ఆర్డినేటర్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

ప్రయాణికులకు సైబర్ క్రైమ్‌పై అవగాహన

నవతెలంగాణ-కామారెడ్డి

సైబర్ జాగృత దివాస్ సందర్భంగా సైబర్ క్రైమ్ పై అవగాహన కార్యక్రమం కామారెడ్డి కొత్త బస్టాండ్‌లో సైబర్ క్రైమ్ పోలీసులు బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిజిటల్ అరెస్ట్ ఫ్రాడ్, జాబ్ ఫ్రాడ్, సైబర్ స్లావేరి, సైబర్ స్టాకింగ్, ఏపీకే ఫైళ్లు, బ్యాంకుల నుంచి నకిలీ కాల్స్, ఇన్వెస్ట్మెంట్స్ (స్టాక్) మోసాలు, డైల్ 1930 ప్రాముఖ్యత, గోల్డెన్ అవర్ ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. సైబర్ కానిస్టేబుల్ ప్రవీణ్ పాల్గొన్నారు.

రోడ్డుపై కూలిన మర్రిచెట్టు

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని మేంగారం గ్రామ సమీపంలో బుధవారం మధ్యాహ్నం రోడ్డుపై మర్రిచెట్టు కూలడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. మేంగారం గ్రామ సమీపంలో ఎల్లారెడ్డి వెళ్లే రహదారి పక్కన గల మర్రి వృక్షం రోడ్డుపై కుప్పకూలిపోయింది. మర్రిచెట్టు కూలిన సమయంలో వాహనాలు లేకపోవడంతో వాహనదారులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ విషయం అధికారులకు సమాచారం అందించడంతో ఆర్అండ్‌బి అధికారులు అక్కడికి చేరుకొని రోడ్డుపై కూలిన మర్రిచెట్టును తొలగించడంతో రాకపోకలు కొనసాగాయి.

అహల్యాబాయి హెూల్కర్ జయంతి ఉత్సవాలు

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డిలోని ఆర్కే, ఎస్ఆర్కే డిగ్రీ కళాశాలలో ఇండోర్ మహారాణి దేవీ అహల్యబాయి హెూల్కర్ 300 సం. జయంతి ఉత్సవాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం తెలుగు ప్రొఫెసర్ ఆచార్య వంగరి త్రివేణి విచ్చేసి రాణి అహల్యాబాయి హెూల్కర్ జీవనగాథను వివరించారు. భారత దేశ చరిత్రలో సుపరిపాలనకు ప్రతిరూపంగా నిలిచిన మరాఠా రాణి అహల్యాబాయి హెూల్కర్ అన్నారు. ఆమె తన అద్భుతమైన కృషి ద్వారా వివిధ విభాగాలలో శాశ్వత ముద్ర వేసిందని తెలిపారు. ఆమె 12 సంవత్సరాల చిన్న వయస్సులోనే మామ మల్హారావు, అత్త గౌతమబాయి నుంచి రాజకీయాలు, సుపరిపాలన గురించి నేర్చుకున్నారన్నారు. మల్హారావు మరణం తర్వాత 1764 నుంచి 1795 వరకు ఇండోర్‌ను దాదాపు మూడు దశాబ్దాలు నిరాఘటంగా పరిపాలన చేసారని అన్నారు. ఆర్కే సీఈవో డా.జైపాల్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులకు భారతీయ చరిత్ర, సంస్కృతిని తెలియ జేయుటకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, దేవి అహల్య బాయి హెూల్కర్ భారతదేశం గర్వించదగ్గ గొప్ప ధీరవనితని కొనియాడారు. అనంతరం వారి చిత్ర పటానికి పూలమాల వేసి పూజించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్స్ సైదయ్య, దత్త్రాత్రి, నవీన్, గోవర్ధన్, గంగాధర్, వైస్ ప్రిన్సిపల్స్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రారంభమైన ఆధార్ సెంటర్

నవతెలంగాణ-లింగంపేట్

మండల కేంద్రంలోని తపాలా శాఖ కార్యాలయంలో ఆధార్ సెంటర్‌ను బుధవారం ప్రారంభించినట్లు నిర్వాహకు మోహన్ తెలిపారు. ఆధార్ కార్డులో తప్పులు ఉన్నవారు వాటిని సరి చేసుకోవడానికి ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఆధార్ సెంటర్ వద్దకు పెద్ద ఎత్తున తరలివచ్చారు. వరుస క్రమంలో ఆన్‌లైన్‌లో వారి దరఖాస్తులను వేలిముద్రలను తీసుకోవడం జరుగుతుందన్నారు. ఆధార్లో తప్పులను సరి చేసుకోవడానికి చక్కటి అవకాశం అని ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలని నిర్వాహకులు సూచించారు. ఈ నెల 12 వరకు తపాల శాఖ కార్యాలయంలో ఆధార్ సెంటర్ కొనసాగుతుందన్నారు.

చదువుకు పేదరికం అడ్డు కాదు

- ప్రముఖ కళాకారుడు కోకిల నాగరాజు
- పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష సామాగ్రి పంపిణీ

నవతెలంగాణ-ఆర్మూర్

విద్యార్థులు కష్టపడి చదివితే ఎంతటి ఉన్నత స్థాయికి అయిన చేరుకోవచ్చని, పేదరికం అసలే అడ్డు కాదని ప్రముఖ కళాకారుడు కోకిల నాగరాజు అన్నారు. మండలంలోని అంకాపూర్ ఉన్నత పాఠశాలలో బుధవారం పదవ తరగతి విద్యార్థులకు జరిగిన వీడ్కోలు సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. విద్యార్థులు ఇష్టపడి చదువుతూ తమకు నచ్చిన రంగంలో అద్భుతమైన విజయాలు సాధించవచ్చని పాఠశాల ప్రధానోపాధ్యాయులు నరసయ్య అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని , విద్యార్థులు కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించాలని వీడిసి అధ్యక్షులు సల్ల మోహన్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా పదవ తరగతి విద్యార్థులకు పరీక్షలకు సంబంధించిన సామాగ్రిని కోకిల సేవా సంస్థ ద్వారా అందజేశారు. ఉపాధ్యాయులందరూ పరీక్షలు రాయడంలో మెళకువలు, ఉత్తమ మార్కులు సాధించడానికి పాటించవలసిన నియమాల గురించి విద్యార్థులకు వివరించారు. అనంతరం జరిగిన సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులు పాటలు, నృత్యాలతో అలరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వినోద్, రఘుపతి ,శ్రీనివాస్, మధుమతి, ఉదయశ్రీ, విష్ణు ప్రియ, శారద, ఇద్రిస్, సుహాసిని పాల్గొన్నారు.



విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు అందజేసిన కోకిల నాగరాజు